వార్త
ఆదివారం
23 ఏప్రిల్, 2023

# నేటి యువకులే రేపటి పాలకులు



తారాతీరం

# ప్రత్యేక పాటలో ఊర్వశి రౌతేలా!



'వాల్తేరు వీరయ్య' సినిమాలో 'వేర్ ఈజ్ ద పార్టీ.. బాసూ వేర్ ఈజ్ ద పార్టీ' అంటూ మెగాస్టార్‌తో హుషారుగా స్టెప్పులు వేసిన బాలీవుడ్ బ్యూటీ ఊర్వశీ రౌతేలా టాలీవుడ్‌లో పేరు తెచ్చుకుంది. ఆ పాట సూపర్ హిట్ అవడంతో ఊర్వశికి టాలీవుడ్‌లో వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ప్రత్యేక పాటల కోసం దర్శకులు ఆమె వైపే చూస్తున్నారు. పోతినేని రామ్–బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ఓ చిత్రంలో ఆమె ఐటమ్ సాంగ్‌లో నర్తించనుంది. ఇప్పుడు ఆమెను మరో ఆఫర్ వెతుక్కుంటూ వచ్చింది. అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఏజెంట్' చిత్రంలో దర్శకుడు సురేందర్ రెడ్డి ఓ ప్రత్యేక పాట తెరకెక్కించాడు. ఇది మాస్ ట్యూన్‌లో వచ్చే జానపద గేయం అని తెలుస్తోంది. ఈ పాటని భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు సమాచారం. ఈ చిత్రం ఈ నెల 28న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇందులో సాక్షి వైద్య హీరోయిన్‌గా నటించగా, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి ఓ కీలక పాత్ర పోషించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి హిప్ హాప్ తమిజా సంగీతం అందించాడు.

# 'సైంధవ్'లో శ్రీనిధిశెట్టి!



వెంకటేశ్ కథానాయకుడిగా వచ్చిన 'ఎఫ్ 3' సినిమా భారీ విజయం సొంతం చేసుకుంది. ఆ తరువాత ఆయన 'ఓరి దేవుడా' సినిమాలో అతిథి పాత్రలో కనిపించారు. ఇటీవలే వెంకీ చేసిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ వేదికగా ప్రేక్షకులను పలకరించింది. 'రానా నాయుడు' ద్వారా ఇతర భాషల వారిని వెంకటేశ్ కలిసారు. ఇక ఇప్పుడు సల్మాన్ కథానాయకుడిగా నటించిన 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' ద్వారా కూడా ఆయన ఇతర భాషల వారికి కనెక్ట్ కానున్నారు. అందువల్ల తెలుగులో ఆయన తాజా చిత్రమైన 'సైంధవ్'ను కూడా పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని సమాచారం. 'హిట్ 2' సినిమాతో సక్సెస్‌ను సాధించిన శైలేశ్ కొలను 'సైంధవ్' సినిమాను రూపొందిస్తున్నాడు. వెంకట్ బోయనపల్లి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణ్ సంగీతం సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి శ్రీనిధిశెట్టి పరిచయమవుతోంది.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
23 ఏప్రిల్, 2023

## మంచి ముత్యాలు

మిత్రుల్ని ఎంచుకోవటంలో నిదానించు,
మార్చవలసి వస్తే ఇంకా నిదానించు.

- బెంజమిన్ ఫ్రాంక్లిన్

## విషయ విశేషం

రారాజు మామిడి... 4
'సంఘీ'భావం....5
దీనావస్థలో గ్రంథాలయాలు
కవర్ స్టోరీ..6
నేటి యువకులే
రేపటి పాలకులు
ఈవారం కవిత్వం..12
తెలంగాణ సచివాలయం
మేం కొని పంపిస్తాం ......18
కథ.. 20
నన్ను మన్నించవా..!
సాహిత్యం...23
తెలుగు సాహితీ దీపిక కారణజన్ముడు.. బ్రౌన్
ఏకశిలా నగరం మహాబలిపురం ...25
తండ్రి ప్రేమ......30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## మందు మానడానికో మందు



ఆరోగ్యం, ప్రమాదాలు వంటి వాటితో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా మద్యం అలవాటు వల్లే ఎక్కువ కుటుంబాలు ఆర్థికంగానూ సామాజికంగానూ వెనుకబడుతున్నాయని అధ్యయనాలెన్నో చెబుతున్నాయి. అందుకే ఆ అలవాటును మాన్పించే మందులకోసం గత కొన్నేళ్లుగా రకరకాల పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. అలా చేస్తున్నప్పుడు సొరియాసిస్ వ్యాధిని తగ్గించడానికి ఇచ్చే మందులు ఆల్కహాల్ అలవాటునీ తగ్గిస్తాయని తెలిసింది. ఆల్కహాల్‌కి బాగా



అలవాటు పడినవాళ్లు దాన్ని ఓ పట్టాన మానలేరు సరికదా, దానివల్ల వచ్చే అనర్థాలనూ గుర్తించలేరు. అయితే దీన్ని మానలేకపోవడానికి వాళ్లలో కొన్ని జన్యువులు పాస్పొడైఎస్టరేజ్-4 అనే ఎంజైమ్‌ను విడుదల చేయడమే కారణమని గుర్తించారు. ఇదే ఇన్‌ఫ్లమేషన్‌కీ కారణమవుతుందట. దాంతో దీన్ని నిరోధించే మందుల గురించి పరిశీలించినప్పుడు సొరియాసిస్‌నీ సొరియాటిక్ ఆర్థ్రయిటిస్‌నీ నివారించే మందులకు ఆ శక్తి ఉన్నట్లు ఆరెగన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మందుల్ని ముందుగా ఎలుకలపైన ప్రయోగించినప్పుడు మెరుగైన ఫలితాలు కనిపించాయట. కాబట్టి వీటిని మనుషుల్లోనూ పరిశీలించి చూడగా ఈ అలవాటు సగానికి సగం తగ్గినట్లు గుర్తించారు. కాబట్టి ఆలహ్కాల్ అలవాటును మాన్పించేందుకు ఈ చికిత్సను త్వరలోనే అందుబాటులోకి తీసుకురావచ్చు అని భావిస్తున్నారు.

## విలువిద్య నేర్పిస్తాం

ప్రపంచంలోని నంబర్‌వన్ ఇంజినీరింగ్ వర్సిటీగా గుర్తింపు ఉన్న అమెరికాలోని ఎంఐటీలో విలువిద్య, కత్తియుద్ధం, తుపాకీ కాల్చడాన్ని నేర్పించే ఓ కోర్సు ఉంది. ఆ కోర్సు పూర్తి చేసినవారికి 'పైరేట్ సర్టిఫికెట్' అని ఇస్తారు. 'జూనియర్ పైరేట్',, 'సీనియర్ పైరేట్', 'ఆనరరీ పైరేట్'..ఇలా ఉంటుంది వాటి గ్రేడ్‌ల వరుస. పైరేట్ అంటే ఇంగ్లిషులో 'సముద్రపు దొంగ' అని అర్థం.







ఆల్ఫోన్సో మామిడి



కేసరి మామిడి

# రారాజు మామిడి



రాస్పురి మామిడి



లంగ్డా మామిడి







బంగినపల్లి మామిడి

పండ్లలో రారాజు మామిడి. మన జాతీయఫలం మామిడి. మనదేశంలోనే మామిడిలో పదిహేనువందల రకాలు పండుతున్నాయి. బహుశ మరే పండ్లలోనూ ఇంతటి వైవిధ్యం ఉండదేమో! నిరుపేదలు మొదలుకొని మహారాజుల వరకు అందరూ ఎంతో ఇష్టంగా ఆస్వాదించే పండు. మామిడిపండ్ల కోసమే ప్రజలు వేసవి కోసం ఎదురుచూస్తుంటారు. మామిడి ఉత్పత్తిలో మన దేశమే అగ్రగామి. బంగిన పల్లి, చెరకురసాలు, చిన్న రసాలు, పెద్దరసాలు, తోతా పురి, సువర్ణరేఖ వంటివి దక్షిణభారతదేశంలో లభిస్తాయి. ఆల్ఫోన్సో, కేసర్, లంగ్డా, దసేరి, సింధూర, రత్నగిరి, చౌసా, రాస్పరి, హిమసాగర్, ఫైరి వంటి రకాలు ఉత్తరభారత దేశంలో లభిస్తాయి. చీత్లా అత్యంత అరుదైన మామిడి పండు. గులాబ్‌ఖస్ కూడా చాలా మధురంగా ఉంటాయి.







చీత్లా మామిడి



# దీనావస్థలో గ్రంథాలయాలు

ప్రజలకు జ్ఞానాన్ని సుముపార్జించి అనేక విషయాలపై పరిజ్ఞానాన్ని పెంచుతూ జీవితాల్లో జ్ఞానజ్యోతులను వెలిగించే గ్రంథాలయాల వ్యవస్థ ప్రస్తుతం మసకబారుతోంది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన గ్రంథాలయాల్లో ప్రస్తుతం చీకటి రాజ్యమేలుతోంది. కొత్త పుస్తకాల కొనుగోళ్లు లేకపోగా కనీసం దినపత్రికలు కూడా సమకూర్చలేని దీనావస్థలో లైబ్రరీలు ఉంటున్నాయి. గతంలో ప్రతి ఒక్కరూ కొంత సమయం లైబ్రరీలో గడిపేందుకు ఆసక్తి చూపించేవారు. క్రీడలకు, పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇస్తేనే సమాజంలో ఆశించిన మార్పులు తీసుకురాగలమన్న విశ్వాసంతో ఏకంగా గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించారు. మద్రాసు ప్రెసిడెన్సీలో తెలుగు రాష్ట్రాలు ఉన్నప్పటి నుంచే గ్రంథాలయ ఏర్పాటుకు బీజాలు పడ్డాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రంథాలయాలు ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆధునిక పద్ధతుల్లో విశాఖపట్నంలో 1886లో విశాఖపట్నంలో తొలి పౌరగ్రంథాయలయాన్ని మంత్రి సూర్యనారాయణ మూర్తి ప్రారంభించినట్లు గ్రంథాలయ ఉద్యమ పుస్తకాల్లో ఉంది. అప్పటి నుంచి గ్రంథాలయాల ఏర్పాటుపై ఆసక్తి పెరుగుతూ వచ్చింది. 1914లో అయ్యంకి వెంకటరమణయ్య విజయవాడలో ఆంధ్రదేశ గ్రంథ భాండాగార ప్రతినిధులతో గ్రంథాలయ మహాసభలు నిర్వహించారు. ప్రజలకు గ్రంథాలయాల ఆవశ్యకత ఏమేరకు ఉందన్న విషయాన్ని గ్రంథాలయ ఉద్యమం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లారు. పుస్తకాలు, గ్రంథాల సేకరణ వంటి వాటిలో నిధుల సమస్య ఎదురైంది. అదేవిధంగా పుస్తకాలను భద్రపరచడం కూడా సమస్యగా మారింది. దీనితో ప్రజల నుంచి ఈ మొత్తాలను సేకరించడం ద్వారా గ్రంథాలయ ఉద్యమాన్ని విజయవంతంగా నిర్వహించగలమన్న భావన వ్యక్తం కావడంతో ఇంటి పన్నుతో పాటు కొంత మొత్తాన్ని గ్రంథాలయ సెస్సు రూపంలో వసూలు చేస్తూ చట్టాలను తీసుకువచ్చారు. ఇంటి పన్నులో ఇది చాలా తక్కువ మొత్తంగా ఉండటంతో ప్రజలు ఈ సెస్సు చెల్లింపు విషయంలో పూర్తిగా సహకరించారు. కాలక్రమేణ పంచాయితీలలో సైతం గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. పెద్ద మొత్తంలో సెస్సు రూపంతో నిధులు సమకూరడంతో గ్రంథాలయాల నిర్వహణ విజయవంతంగా కొనసాగింది. పలు జిల్లా కేంద్రాల్లో ఇప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు గ్రంథాలయాలకు వెళుతున్నారు, ముఖ్యంగా పోటీ పరీక్షల సమయంలో యువత ఎక్కువ కాలం గ్రంథాలయాల్లో గడుపుతుంటారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి వెళ్లి కనీసం గంట సేపు పుస్తక పఠనం చేయడం ద్వారా అంతులేని విజ్ఞానాన్ని పొందవచ్చని మానసిక నిపుణులు, వ్యక్తిత్వ వికాసం శాస్త్రజ్ఞులు స్పష్టం చేస్తున్నారు. ఒకప్పుడు గ్రంథాలయం చైర్మన్లకు అత్యధిక ప్రాధాన్యత లభించేంది. గ్రంథాలయ చైర్మన్ వస్తుంటే ప్రతిఒక్కరూ అమితంగా గౌరవించే వారు. గ్రంథాలయ పరిషత్‌లు ఏర్పడిన తరువాత గ్రంథాలయ వ్యవస్థ మరింత పటిష్టం అయ్యింది. అయితే మారుతున్న ఆధునిక సాంకేతిక విధానాలను అనుసరించడంలో గ్రంథాలయాలు వెనుకబడ్డాయి. కంప్యూటర్లు వచ్చిన తరువాత పుస్తక పఠనం గణనీయంగా తగ్గిపోయింది. ఇప్పుడు ఏ సమాచారం కావాలన్నా కంప్యూటర్ల ద్వారా లభిస్తోంది. కంప్యూటర్లలో ఎంత సమాచారం లభించినా పుస్తకపఠనం ద్వారా లభించిన విషయ పరిజ్ఞానం మెదడులో ఎక్కువ కాలం సంక్షిప్తమై ఉంటుందని మానసిక శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. అయితే ఆశించిన మేరకు పుస్తకాలు గ్రంథాలయాల్లో లభించకపోవడంతో ఎక్కువ శాతం మంది కంప్యూటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. లైబ్రరీలను సైబర్ నెట్ పరిశోధనా కేంద్రాల స్థాయికి తీసుకువెళితే మళ్లీ గ్రంథాయాలకు ఆదరణ పెరిగే అవకాశం ఉంటుంది. గతంలో గ్రంథాలయాలకు తరచూ వెళ్లే యువత ప్రస్తుతం నెట్‌కేఫ్‌ల పట్ల మొగ్గు చూపుతున్నారు. గంట సమయానికి కొంత మొత్తం వసూలు చేయడం ద్వారా నెట్‌కేఫ్‌లు కంప్యూటర్లను వైఫై సౌకర్యంతో అందుబాటులో ఉంచుతున్నాయి, అయితే గ్రంథాలయాల్లో ఈ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సి ఉంది. చాలా మందికి స్వంత కంప్యూటర్లు, నెట్ సౌకర్యం కల్పించుకునే స్థాయి ఉండదు. అదే విధంగా ప్రతిరోజూ నెట్‌కేఫ్‌లకు వెళ్లి అద్దె చెల్లించలేని స్థితిలో ఉన్న వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. పోటీ పరీక్షల సమయంలో అనేక అంశాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. వీరు గ్రంథాలయాలకు వెళ్లినా అక్కడ పూర్తి సమాచారం లభించడం లేదు. ప్రజల నుంచి సెస్సు రూపంలో వసూలు చేస్తున్న నిధులను మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలు గ్రంథాలయాలకు ఇవ్వడం లేదు. దీనితో ఒక్కొక్క జిల్లాలో కోట్ల రూపాయల్లో బకాయి పడ్డారు. నిధుల కొరత వల్ల గ్రంథాలయాల సిబ్బందికి కూడా జీతాలు ఇవ్వలేని దుస్థితి ఉంది. సెస్సుల రూపంలో వసూలు అవుతున్న నిధులను ఎప్పటికప్పుడు గ్రంథాలయ సంస్థకు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు ఆధునిక సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేక నిధులను కేటాయించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# నేటి యువకులే రేపటి పాలకులు

**కవర్ స్టోరీ**

**బండారు రామ్మోహనరావు**

**భారతదేశంలో రాజకీయాల్లో యువత ప్రవేశించడానికి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన జాతీయ ఉద్యమం ఒక అవకాశంగా మారింది. చాలామంది విద్యావంతులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు ఇతర వృత్తులవారు అక్షరాస్యులు నిరక్షరాస్యులు అనే తేడా లేకుండా ఎంతో మంది యువతీ యువకులు ఆనాటి జాతీయ రాజకీయ ఉద్యమం ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.**

అలా అడుగుపెట్టిన వారిలో కొందరు బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటంలో అమరులయిపోగా మరికొందరు స్వాతంత్ర్య అనంతరం రాజకీయాల్లో మనగలిగారు. అనేక ఉన్నత పదవులు పొందగలిగారు. జాతీయ ఉద్యమ స్ఫూర్తితో అనేక రంగాలలో ఉద్యమ స్ఫూర్తితో మంచి మార్పులు తేగలిగారు. అది విద్య కావచ్చు, ఆరోగ్యం కావచ్చు, మంచి పరిపాలన కావచ్చు. ఇలా ఏ రంగంలోనైనా ఆనాటి యువత వ్యవస్థల ఏర్పాటులో నిర్మాణంలో తమ వంతు పాలుపంచుకున్నారు.

## నేటి నిజం ఏమిటి?

అది ఒకనాటి సంగతి. కానీ నేడు సామాన్య యువత రాజకీయాలలోకి రావడానికి అనేక అవాంతరాలు, అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఒకవేళ ఎవరైనా అమాయకంగా తాము రాజకీయాల్లోకి పోతామని సామాన్య యువతీ యువకులు అంటే వారి కుటుంబ సభ్యులతో పాటు సమాజం హేలన చేసే పరిస్థితి ఉంది. దానికి కారణం.. రాజకీయాలంటే మోసం, ద్వేషం, పనికిరానివి అని అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఈ మాట సమర్థించే చర్యలు సమాజంలో ప్రతిరోజు ఎన్నో జరుగుతున్నాయి. ఎంతమంది యువతీ యువకులు రాజకీయ పార్టీలను నమ్ముకుని, ఉద్యమాలను నమ్ముకుని రాజకీయాల్లో ఏదో పొడిచేస్తాం అని వచ్చి మోసపోయి అటు ఉద్యోగాలకు పనికిరాకుండా ఇటు రాజకీయాల్లో పదవులు రాకుండా పోతున్నారు. రెంటికి చెడ్డ రేవడిలా తయారవుతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే "న ఘర్కా న ఘాట్కా" అనే సామెతను నిజం చేస్తున్నారు. రాజకీయ పార్టీల పల్లకి మోసే బోయలుగా యువత రాజకీయ పార్టీల నేతల పల్లకి మోసే బోయలు లాగానే యువత మిగిలిపోతున్నారు. అప్పటికే రాజకీయాల్లో బాగా ఎస్టాబ్లిష్ అయిన రాజకీయ కుటుంబాల నేతలు కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్లు ఇతరత్రా బంధుత్వాలు ఉన్న యువత రాజకీయాలలో సామాన్య యువతను తొక్కిపెడుతున్నారు. రాజకీయ వారసులుగా వచ్చినవారికి కొన్ని అడ్వాంటేజెస్ ఉంటాయి. మొదటి అడ్వాంటేజ్: వారికి రాజకీయాల్లో ఎంట్రీ ప్రవేశంగా వారసత్వంగా వస్తుంది. వాటిని ఆసరా చేసుకుని వారు ముందుకెళ్తుంటే ఎలాంటి ఆసరా లేకుండా రాజకీయాలలో మనగలిగే పరిస్థితి సామాన్య మధ్య తరగతి యువతకు కరువైంది. ఒకవేళ డబ్బున్న యువత కూడా రాజకీయాల్లోకి రావాలని అనుకుంటే వారి జేబులు ఖాళీ అవుతున్నాయి తప్ప పదవులు రావడం లేదు. దానికి కారణం చాలా ప్రాంతీయ పార్టీలు ప్రైవేటు ఆస్తులుగా మారిపోయిన సందర్భంలో ఆయా ప్రాంతీయ పార్టీల నాయకుల కొడుకులు, కూతుళ్లు మాత్రమే రాజకీయాల్లో వారసత్వ పదవులు అనుభవిస్తున్నారు. ముఖ్యమంత్రి కొడుకు ముఖ్యమంత్రి కావాలని, కొడుకులు లేకపోతే ముఖ్యమంత్రి కూతురు ముఖ్యమంత్రి కావాలని ఆశపడుతున్నారు, ఆశిస్తున్నారు. ఇది ఒక రాజకీయ దైవ శాసనంగా వారు

మారుస్తున్నారు.

**వారసత్వ రాజకీయాలలో కూడా కొనసాగుతున్న లింగ వివక్ష**

వారసత్వ రాజకీయాలలోనూ లింగ వివక్ష కొనసాగుతుంది. ఆయా రాజకీయ పార్టీ నాయకుల కొడుకులకి మొదటి ప్రాధాన్యం దక్కుతుంది. ఒకవేళ ఎవరైనా రాజకీయ వారసులుగా వస్తుంటే ఆయా రాజకీయ నాయకులకు మగపిల్లలు లేనట్లే లెక్క. ఉదాహరణకు సోనియాగాంధీకి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. కానీ రాహుల్‌గాంధీని ముందుకు పెట్టినట్లు ప్రియాంక గాంధీని ముందుకు రానివ్వడం లేదు. మొన్నటిదాకా జాతీయ పార్టీగా కొనసాగిన నేషనల్ లిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎన్‌సిపి వ్యవస్థాపకుడు మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా పేరున్న నాయకుడు మరాఠా యోధుడు శరత్‌పవార్ గారికి కొడుకులు లేరు. ఉన్న ఒక్క బిడ్డ సుప్రియ సూలే కనుక ఆమె రాజకీయాల్లో రాణించింది. ఇలా చెప్పుకుంటూ పోతే దేశవ్యాప్తంగా నాయకుల కొడుకులకే వారసత్వం వస్తుంది. కానీ కూతుళ్లకు రావడం లేదు. ఇది ఒక విషాదం.

**చరిత్రలో ఏం జరిగింది?**

ఒకసారి మళ్లీ వెనక్కి వెళ్లి చూస్తే 1969 జై తెలంగాణ తొలి దశ ఉద్యమంలో యువత బాగా రాజకీయాలలోకి రాగలిగింది. ఆనాడు ఉద్యమ నిర్మాతలుగా ఉన్న మదన్‌మోహన్, మల్లికార్జున్, జైపాల్‌రెడ్డి లాంటి నాయకులతో పాటు సీనియర్ నాయకులైన మర్రి చెన్నారెడ్డి లాంటివారు కూడా తెలంగాణ జై ఉద్యమంలో ముందు ఉన్నారు. ఆ ఉద్యమంలో పాల్గొన్న చాలా మంది యువత ఆ తర్వాత వారసత్వం లేకుండానే రాజకీయాలలో మనగలిగారు. అలాగే 1972లో వచ్చిన జై ఆంధ్ర ఉద్యమం నుంచి ఎంతోమంది యువత రాజకీయాల్లోకి రాగలిగారు. అందులో ప్రధానంగా మొన్నటిదాకా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా పనిచేసిన భారత రాజకీయాలను ప్రభావితం చేసిన ఎం.వెంకయ్యనాయుడు పేరు ప్రముఖంగా చెప్పుకోవచ్చు. అలా ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా ఎంతో మంది నాయకులు జై ఆంధ్ర ఉద్యమం నుంచి రాజకీయాల్లో ఎదిగారు. వీరెవరికీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాల నేపథ్యం లేదు. ఆ తర్వాత ఎమర్జెన్సీ నుండి కూడా కొత్త నాయకత్వం వచ్చింది. విద్యార్థి ఉద్యమాల నుండి వచ్చిన కొత్త తరం రాజకీయ నాయకులు అలాగే అస్సాం రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమ నాయకుడిగా గణ సంగ్రామ పరిషత్ స్థాపించిన ప్రఫుల్ల కుమార్ మొహంతా ఆధ్వర్యంలో అస్సాం ప్రజల హక్కుల కోసం పోరాడిన ఉద్యమంలో ఆ తర్వాత విద్యార్థి నాయకులు ఎంతోమంది రాజకీయాల్లో పదవులు పొందారు. అంతెందుకు! స్వయంగా ఉద్యమ నాయకుడైన ప్రఫుల్లకుమార్ మహంతా ఆనాడు అస్సాం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆనాటి జాతీయోద్యమం నుంచి నేటి తెలంగాణ ఉద్యమం వరకు ఉద్యమ నాయకులు ఎంతో మంది రాజకీయాలలో వారసత్వం రాజకీయాలకు అతీతంగా మనగలిగారు.



ఆత్మగౌరవ నినాదంతో ఎన్టీఆర్ అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన భ్రష్టు పట్టిపోయి పెద్ద ఎత్తున తెలుగువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సందర్భంగా వరుసగా ముఖ్యమంత్రులను ఒకటవ కృష్ణుడు, రెండవ కృష్ణుడు, మూడవ కృష్ణుడులాగా మార్చి పదవులు కట్టబెట్టిన సందర్భంలో వారిని అవమానిస్తున్న సందర్భంలో తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో వచ్చిన ఎన్టీ రామారావు రాజకీయ రంగంలో యువతకు మంచి స్థానం కల్పించారు. అప్పటివరకు కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎంతోమంది నాయకులు తెలుగుదేశంలో చేరినా కూడా ఆయన తనను నమ్ముకున్న యువతకు అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ టికెట్లు ఇచ్చి ప్రోత్సహించారు. అలా చాలామంది యువత ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన యువత రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, మంత్రులుగా, స్పీకర్లుగా అనేక ఉన్నత పదవులు పొందగలిగారు. అలా ఒక రాజకీయ ఉప్పెనలాగా 'వేవ్' వచ్చిన సందర్భంలో కూడా సామాన్య యువత రాజకీయాలకు రాగలిగింది. ఆనాడు రాజకీయాలలో డబ్బు మద్యం ప్రమేయం అంతగా లేదు. కానీ ఈనాడు రాజకీయాలలో డబ్బు, మద్యం ప్రమేయం లేకుండా రాజకీయాలను నడిపే పరిస్థితి లేదు. అలాగే ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదంతో ముడిపడి ఎంతోమంది ఉద్యోగులు, తటస్తులు ఆనాడు రాజకీయాలలోకి రాగలిగారు. అలా వచ్చిన వారిలో అప్పటికప్పుడు ఎంపిక చేసి అసెంబ్లీలో పోటీ చేయడానికి తెలుగుదేశం పార్టీ టికెట్లు ఇవ్వడం వల్ల ఎన్టీఆర్ తలచుకుంటే 'దీపపు స్తంభాన్ని' కూడా



గెలిపించగలుగుతారు అనే ఒక నానుడి రాజకీయాల్లో ఆనాడు కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే మొట్టమొదటిసారి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని స్థాపించగలిగారు. ఆ తర్వాత రాజకీయ అనుభవ రాహిత్యంతో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కుట్రల వల్ల ఆగస్టులో అధికారం కోల్పోయినా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ఆ యువతనే నమ్ముకున్న ఎన్టీఆర్ 1985లో జరిగిన ఎన్నికల్లో మరొకసారి అప్రతిహతమైన విజయాన్ని సాధించడంలో ఆనాటి సామాన్య మధ్య తరగతి యువత పాత్ర మరువలేనిది. అలా తెలుగు రాష్ట్రాలలో బలహీన వర్గాలకు చెందిన యువత చాలామంది రాజకీయాలలోకి వచ్చి విజయవంతమైన రాజకీయవేత్తలుగా పేరు తెచ్చుకున్నారు.




**ఎమర్జెన్సీ నేపథ్యం నీలినీడల నుండి..**

ఇక దేశంలో 1975లో ఇందిరాగాంధీ అలహాబాద్ హైకోర్ట్ తీర్పు వల్ల పదవి కోల్పోయి తన ప్రధాని పదవి రక్షించుకోవడానికి ఎమర్జెన్సీ పెట్టి ప్రజాస్వామ్య హక్కులను హరించినప్పుడు మరొకసారి సామాన్య యువత రాజకీయాల్లోకి రాగలిగింది. పూర్ణ స్వరాజ్ అనే నినాదంతో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ గారు ప్రారంభించిన ఉద్యమంలో అనేకమంది కార్మిక, కర్షక, విద్యా రంగాల నుండి యువత రాజకీయాల పట్ల ఆకర్షితులై ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత దేశంలో మొట్టమొదటి కాంగ్రెసేతర జనతా ప్రభుత్వం ఏర్పడడం, అది కిచిడీ ప్రభుత్వంగా మారినా కూడా ఆనాటి స్ఫూర్తితో వచ్చిన యువతరం నాయకులు ఎంతోమంది యువత ఇప్పటికీ రాజకీయాలలో మనగలుగుతున్నారు. అలా వచ్చినవారే ఉత్తర భారతదేశంలోని లాలూప్రసాద్ యాదవ్ నుంచి మొదలుకొని నితీష్‌కుమార్, ములాయం సింగ్ యాదవ్, జార్జ్ ఫెర్నాండేజ్ లాంటివారు ఎంతో మంది యువత రాజకీయాల్లోకి వచ్చి వివిధ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా పని చేశారు. జనతా పార్టీ ప్రయోగం విఫలం తర్వాత వీరందరూ తమ తమ రాష్ట్రాలలో



ప్రాంతీయ పార్టీలు స్థాపించి అందులోకి యువతను ఆహ్వానించి ఆయా పార్టీలను ఆయా రాష్ట్రాలలో అధికారంలోకి తేగలిగారు. అలా చూస్తే ఆ తర్వాత ఆ ప్రాంతీయ పార్టీల ప్రధాన నాయకులుగా వారు రాజకీయ కుటుంబాలుగా మారిపోయి వారి కొడుకులు, కూతుళ్లు, ఇతర బంధువులను రాజకీయాల్లో దింపి ప్రస్తుతం రాజకీయ వారసత్వ పోరాటంలో వారిదే పై చేయిగా మారిపోయిన విషాద పరిస్థితి కనపడుతుంది. ఒక తేజస్వి యాదవ్, మరొక అఖిలేష్ యాదవ్ ఇలా ఎంతోమంది అప్పటి యువ ముఖ్యమంత్రుల పిల్లలు రాజకీయ వారసులుగా ప్రస్తుతం రాజకీయాలను శాసిస్తూ కొనసాగిస్తున్నారు. ఇలా ఒరిస్సాలో బిజు పట్నాయక్ వారసుడు నవీన్ పట్నాయక్ సరాసరి విదేశాల నుంచి వచ్చి తన తండ్రి వారసత్వానికి ప్రతీకగా మారి వరుసగా మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికై ఒరిస్సా రాష్ట్రానికి అద్భుతమైన పాలన అందిస్తున్నారు. అలాగే తన తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత 9 ఏళ్ల పాటు రాజకీయ పోరాటం చేసి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా రాజకీయ వారసత్వ కుటుంబం నుండి వచ్చినవారే కదా! అలా అని వారసత్వ రాజకీయాలు పనికిరావు అని నిరూపించడానికి కూడా ఎన్నో ఉదాహరణలు పనికి వస్తాయి. కానీ సామాన్య యువతర రాజకీయాల్లోకి రావడానికి ఇవన్నీ అవరోధాలుగా మారుతున్నాయనడానికి సందేహమే లేదు. అలా ఉత్తర భారతదేశంలోని





అనేకమంది వారసత్వ రాజకీయాలు లేకుండా రాజకీయాలకు వచ్చినవారుతున్నారు. ఆ తర్వాత వారి కుటుంబాలలోని యువతను రాజకీయాలలోకి దించి కొత్త తరాన్ని రాకుండా చేసినవారు కూడా ఉన్నారు. ఇక దక్షిణ భారతదేశానికి వస్తే దేశంలో మొట్టమొదటిసారి ప్రాంతీయ పార్టీలను ఏర్పాటు చేసిన తమిళనాడు రాష్ట్రాన్ని ఉదాహరణకు చెప్పుకోవచ్చు. మొదట ద్రవిడ మున్నేట్ర కజగం డీఎంకే, ఆ తర్వాత అది విడిపోయి అన్నాడీఎంకే ఇలా ప్రస్తుతం డజనుకు పైగా ద్రవిడ పార్టీలు ఆ రాష్ట్రంలో ఉన్నాయి. కానీ ప్రధానంగా డీఎంకే, అన్నాడీఎంకెలలో వారసత్వ రాజకీయాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ తన తండ్రి కరుణానిధి వారసుడిగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ప్రాంతీయ పార్టీలు అన్నీ కూడా ప్రైవేటు ఆస్తులుగా మారిపోయిన సందర్భంలో ధన బలంతో రాజకీయాలను నడపగలుగుతున్నారు. అటు ఏడు, ఇటు ఏడు తరాలకు సరిపడా రాజకీయాలలో డబ్బు సంపాదించి వాటిని మళ్లీ మళ్లీ పెట్టుబడి పెడుతూ రాజకీయాలలో వారసత్వ యువత తిష్ట వేసుకుని కూర్చుంటున్నారు.

### ఆకస్మిక మార్పే విప్లవం

ఇది నేటి భారతంలో వారసత్వ రాజకీయాల చరిత్రగా మనం చెప్పొచ్చు. రాజకీయాలలో మార్పు ఒక్కసారిగా వస్తే అది విప్లవమంటారు. అలాంటి విప్లవం రాదు అని నిరాశపడడం కూడా సరైనది కాదు. అవకాశం వస్తే యువత ఏదైనా చేయగలుగుతారు అనడానికి ఒక మంచి ఉదాహరణ: తెలంగాణ మలిదశ ఉద్యమం ఒక ఉదాహరణ. 2001 తర్వాత తెలంగాణ ఉద్యమంలో అనేకమంది యువత పాల్గొని గమ్యాన్ని ముద్దాడేదాకా పోరాడారు. మరికొంతమంది మధ్యలోనే ఆత్మహత్యలు చేసుకుని మొగ్గలోనే తుంచివేయబడ్డారు. కానీ ఈ ఉద్యమం తర్వాత కొందరు ఉద్యమ నాయకులు అధికారంలోకి వచ్చినా కూడా మళ్లీ ఇక్కడ కూడా అంతిమ రాజకీయ అధికారం తెలంగాణ ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు, కూతురు, అల్లుడు, మరొక కజిన్ చేతుల్లో పూర్తి అధికారం కేంద్రీకృతమైంది. ఉద్యమ నాయకులు అసలే లేరని కాదు.. కానీ అంతిమ నిర్ణయాధికారం ఒక కుటుంబం చేతిలో



ఉండిపోతుంది. ప్రస్తుతం తెలంగాణలో యువత స్వతంత్రంగా రాజకీయాల్లోకి రాగలుగుతుందా అంటే చెప్పడం కష్టమే. ఇలా నేడు యువత రాజకీయాలకు రాకపోవడానికి ప్రధానంగా రాజకీయాలలో డబ్బు, మద్యం ప్రభావం పెరగడం, ఎన్నికల్లో ప్రలోభాల పర్వం కొనసాగడం సిద్ధాంత పరమైన రాజకీయాలు మాని అధికారం కోసం మాత్రమే వెంపర్లాడే రాజకీయాలు రావడం ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. విజేత మాత్రమే భవిష్యత్తును నిర్ణయించే మొనగాడుగా మారడం, ఓడినవారు చరిత్రలో మిగలకపోవడం జరుగుతుంది. దీనికి ప్రధానమైన కారణం ఓటు వేసేది మనం ప్రభుత్వాన్ని నడిపేది మనం అనే ప్రజాస్వామ్య సూత్రం ప్రజలకు వంట పట్టకపోవడం అనేది నేటి విషాదం.

### మన ఓటు మన గౌరవం-మన ఓటు మన భవిష్యత్తు!

అవును.. మన ఓటు ద్వారా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. మన పనుల డబ్బుల ద్వారా ప్రభుత్వాలు నడుస్తున్నాయి. కానీ ఈ నగ్నసత్యాన్ని ప్రజలకు చూపించడానికి రాజకీయ పార్టీలు ఇష్టపడడం లేదు. సమాజాన్ని జాగృతం చేయాల్సిన మీడియా కూడా ఈ రాజకీయాల ఆటలో ప్రేక్షక పాత్ర మాత్రమే వహిస్తుంది. లేక ఎటో ఒకవైపు మొగ్గు చూపిస్తుంది. ఎవరి స్వార్థం వారిదే! ఎవరి ఆలోచన వారిదే! కానీ కొత్త సిద్ధాంతాలతో సరికొత్త ఆలోచనలతో రాజకీయ పార్టీ స్థాపించి చేతులు కాల్చుకున్నవారు కూడా మనకు చరిత్రలో కనపడుతున్నారు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డాక్టర్ జయప్రకాశ్ నారాయణ గారు మొదట లోకసత్తా ఉద్యమ సంస్థను



ప్రారంభించి, ఆ తర్వాత లోక్‌సత్తా పార్టీ స్థాపించి 1999లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో తాను ఒక్కడే గెలిచి నిలిచినా కూడా ఆ తర్వాత క్రియాశీల రాజకీయాలలో మనగలగలేకపోయారు. దానికి కారణం రాజకీయాలలో డబ్బు, మద్యం ప్రమేయం పెరగడంతో పాటు నైతిక విలువలు లోపించడం కూడా చెప్పుకోవచ్చు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా అనేక కొత్త పార్టీలు పుట్టుకొచ్చాయి. కానీ అవి మనగలగలేకపోవడానికి కారణం కూడా డబ్బు, మద్యం ప్రమేయమే.

### చీకటిని తిడుతూ కూర్చుందామా?

ఇలా చీకటిని తిడుతూ కూర్చోకుండా చిరు దీపం వెలిగించే ప్రక్రియను నేటి యువత ప్రారంభించాలి. రాజకీయాలలో




మనం ఎవరికీ తీసిపోమని, యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని నమ్మి ముందుకు సాగితే తప్పక విజయం ముద్దాడుతుంది. కానీ పిల్లిమెడకు గంట కట్టేది ఎవరు అనేది నేటి ప్రశ్న. దేశవ్యాప్తంగా యువత రాజకీయాల్లోకి రావాలంటే ఏవైనా ఉద్యమాలు మాత్రమే రావాలా? లేక భావ సారూప్యం కలిగిన యువత ఏకమైన ఒక కొత్త నినాదంతో మార్పు కోసం, మంచి కోసం రాజకీయాల్లోకి వస్తే సాధించలేనిది ఏమీ ఉండదని మరికొందరు అంటున్నారు. అందుకే "యువతా మేలుకో.. దేశాన్ని ఏలుకో" అనే నినాదంతో నేటి యువత రాజకీయాల్లో పునఃప్రవేశం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయాలను అసహ్యించుకోకుండా రాజకీయాలను ప్రేమించి ముందుకు




వస్తే తప్పక విజయం వారిని వరిస్తుంది. కానీ ఆ మొదటి అడుగు వేసేవారే కావాలి.

### గాంధీమార్గం అనుసరణీయమేనా?

చివరగా మహాత్మాగాంధీ గారు చెప్పిన మాటలతో ముగిస్తాను. "ఏదైనా కొత్త పని మొదలుపెట్టినప్పుడు మొదట ఎవరూ పట్టించుకోరు. ఆ తర్వాత వారు చేసే పనులను బట్టి వారి ఉనికిని మొదట పట్టించుకోనివారే గుర్తిస్తారు. ఒకవేళ కొందరికి నష్టం కలిగితే ఆ నష్టం కలిగినవారు వీరికి వ్యతిరేకంగా విమర్శలు మొదలుపెడతారు. విమర్శలు తట్టుకొని నిలబడగలిగినప్పుడు మాత్రమే విజయం సాధ్యమవుతుంది. ఈ మూడవ దశ చాలా కీలకమైంది ఈ మూడవ దశ సంధి కాలంలో తాము ఏదైనా లక్ష్యం ఎంచుకున్నారో ఆ ప్రయత్నాన్ని, ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తారా లేక మడిమ తిప్పి వెనక్కి పోతారా అనేదాన్ని బట్టి విజయం ఆధారపడి ఉంటుంది. మూడవ దశలోని విమర్శనాస్త్రాలను తిప్పికొట్టి నాలుగవ దశలోకి వెళ్లి ప్రయత్నిస్తే అంతకుముందు విమర్శించిన నోళ్లే మూతపడతాయి. ఎవరైతే మార్పు కోసం ప్రయత్నిస్తున్నారో వారి వెంట విమర్శించినవాళ్లే వెంట నడుస్తారు. చివరికి కొత్త మార్గం తొక్కిన వారిదే విజయం అన్న గాంధీ మహాత్ముడు చెప్పిన ఈ సూత్రాన్ని నేటి యువత ఆదరిస్తే తప్పక విజయం సాధిస్తారు. అప్పుడు ఉందిలే మంచి కాలం ముందూ ముందునా అని ప్రజలు కూడా స్వాగతిస్తారు.





# మ్యాడ్‌స్కిల్స్‌కు అవకాశాలెన్నో..

**కొందరు** టెన్నిస్‌లో ఉన్నతంగా రాణిస్తుం టారు. సంగీతవాయిద్యాలను వాయించడంలో మీరు ఘనాపాఠీ కావచ్చు.. సాహసాలు చేయడంలో మీకుమీరే సాటికావచ్చు. అయితే ఇవి మీ అభిరుచి, ఆసక్తికి మాత్రమే పరిమితం కావడం లేదు. మీరు మంచి ఉద్యోగం లో ఎంపిక కావడంలో కీలకపాత్ర పోషించే శక్తులు అవుతున్నాయని మీకు తెలుసా? కాలంతోపాటు ఉద్యోగ ఎంపిక ప్రమాణాలలో కూడా మార్పు వస్తోంది. ఉద్యోగం రావడానికి ఉపకరించే హార్డ్‌స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్ విభాగాలకు ఇప్పుడు మూడో విభాగం కూడా తోడైంది. అదే మ్యాడ్‌స్కిల్స్.

### మ్యాడ్‌స్కిల్స్ అంటే?

ఉద్యోగప్రయత్నాలు చేసేవారి రెజ్యూమ్ లేదా సీవీలలో హార్డ్‌స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్ అని రెండు విభాగాలు ఉంటాయి. మొదటిది జ్ఞానాన్ని సర్టిఫికెట్లతో తూచే విషయం. రెండోది మార్కులు, ర్యాంకులతోపాటు నైపుణ్యబలాన్ని అంచనావేయడం. ఇప్పుడు ఈ రెండు విభాగాలతో పాటు 'మ్యాడ్ స్కిల్స్' అనే మూడో విభాగం కూడా తోడైంది. మ్యాడ్‌స్కిల్స్ అనగానే వ్యంగ్యం, వ్యతిరేకత ధ్వనించవచ్చుగానీ, ఇక్కడ మ్యాడ్‌స్కిల్స్ అంటే 'పనికిరాని వృథా స్కిల్స్' అని అర్థం కాదు. ఉద్యోగుల ఎంపికకు సంబంధించి కంపెనీల నిర్ణయాలలో 'మ్యాడ్ స్కిల్స్' కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. సాఫ్ట్ స్కిల్స్ కంటే 'మ్యాడ్‌స్కిల్స్'ను అరుదైన, అవసరమైన స్కిల్స్‌గా భావిస్తున్నాయి కంపెనీలు. ఒక మేనేజర్ పోస్ట్ ఎంపికలో అభ్యర్థి అభిరుచులపై కంపెనీలు ప్రత్యేక దృష్టి పెట్టడం అనేది గతంలో అంతగా లేకపోవచ్చు. ఇప్పుడు మాత్రం అది ఒక అనివార్యమైన విషయం అయింది. రిక్రూట్‌మెంట్ స్పెషలిస్టులు రెజ్యూమ్‌లోని 'హాబీస్ అండ్ ట్రావెల్స్' స్పేస్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. 'మ్యాడ్‌స్కిల్స్'ను కంపెనీలు తమ ప్రత్యేక ఆస్తిగా భావించుకోవడానికి కారణం అవి క్రియేటివ్ స్కిల్స్ రూపంలో తమ కంపెనీకి తోడ్పడతాయనే నమ్మకం. ఉదాహరణకు మానస అనే అమ్మాయి ఒక కంపెనీలో ఏదో ఉద్యోగానికి అప్లై చేసింది అనుకుందాం. మానసకి 'ట్రెక్కింగ్' హాబీ ఉంది. అయితే ఉద్యోగ ఎంపికలో అది ఆమె వ్యక్తిగత అభిరుచికి సంబంధించిన గుర్తింపుకే పరిమితం కావడం లేదు. ఈ అభిరుచి ద్వారా కంపెనీలు తమ వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. 'కొత్త ప్రదేశాలలో సర్దుకుపోగలదు', 'సవాళ్లను స్వీకరించగలదు' అందరితో కలిసిపోయే స్వభావం ఉంది' ఇలా మానస గురించి కొన్ని అంచనా లకు రావడానికి వీలవుతుంది. 'ఒక మేనేజర్ పోస్ట్‌కు పదిమంది వ్యక్తులు పోటీపడితే, అందరి బలాలు సమానంగా ఉన్నాయనుకున్నప్పుడు మ్యాడ్‌స్కిల్స్ కీలకం అవుతాయి. అభిరుచుల ఆధారంగా వ్యక్తిత్వంపై ఒక అంచనాకు రావడానికి ఇవి తోడ్పడతాయి. విభిన్నమైన అభిరుచులు, నైపుణ్యాలు, బలమైన వ్యక్తిత్వం, పర్సనల్ ప్రాజెక్ట్‌లకు కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి' అంటున్నారు నిపుణులు. ఆటలు (ఫుట్‌బాల్ నుంచి చెస్ బాక్సింగ్ వరకు), ఆర్టిస్టిక్ యాక్టివిటీస్ (రచనలు చేయడం నుంచి పాటలు పాడడం వరకు), ప్రధాన స్రవంతికి భిన్నంగా ఔట్ ఆఫ్ ద బాక్స్ ఆలోచించడం ఇలా ఎన్నో మ్యాడ్‌స్కిల్స్ (యూనిక్ క్రియేటివ్ స్కిల్స్) విభాగంలోకి వస్తాయి. 'జాబ్ ఔట్‌లుక్ 2022' సర్వే ప్రకారం ఉద్యోగ ఎంపికలో బడా కంపెనీలు ప్రాబ్లమ్ సాల్వింగ్‌న స్కిల్స్' ఇది మాత్రమే నా పని' అని కాకుండా ఇతరత్రా విషయా లలో చొరవ చూపించే నైపుణ్యం, రచన, కమ్యూనికేషన్ స్కిల్స్.. మొదలైనవాటికి అగ్రస్థానం ఇస్తున్నాయి. అయితే వీటికి సంబంధించిన వేర్లు 'మ్యాడ్‌స్కిల్స్'లోనే ఉన్నాయి. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో ప్రతిధ్వనించిన ఎక్స్‌ప్రెషన్ మ్యాడ్ స్కిల్స్, సిలికాన్ వ్యాలీలోని కంపెనీలు ఉద్యోగ ఎంపికలో మ్యాడ్ స్కిల్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఇప్పుడు యూరప్‌లో కూడా ఉద్యోగ ఎంపికలో 'మ్యాడ్‌స్కిల్స్' ట్రెండ్‌గా మారింది. 'మంచి మార్కులు, ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెపనపడం అనేది ఉద్యోగ ఎంపికలో కీలకపాత్ర పోషించినప్పటికీ, మ్యాడ్‌స్కిల్స్ ప్రాధాన్యత వేరు. కంపెనీ అభివృద్ధి చెందాలంటే భిననంగా ఆలోచించేవారు ఉండాలి. వారి నుంచే కంపెనీ అభివృద్ధికి అవసరమైన సృజనాత్మక ఐడియాలు వస్తాయి.



# తెలంగాణ సచివాలయం

కొంగొత్త రీతిలో వెలసిన సచివాలయము
గుమ్మటంపై నుండి పలకరించే జాతీయ చిహ్నాలు
అన్ని హంగులతో మిరుమిట్లుగొలిపే పరిపాలన నిలయం
బంగారు తెలంగాణ దేవాలయం
దక్షిణ భారత సంప్రదాయం
ఇంద్రధనస్సునే తెచ్చి సింహద్వారముగా
నిలిపిన శోభాయమానం
తెలంగాణ సంస్కృతి ఉట్టిపడే సంకేతం
నీలకంఠేశ్వర ఆలయ కట్టడ కౌశలం
కాకతీయుల నిర్మాణశైలి ప్రతిరూపం
అన్ని కళలు తళుకులీను వైభవం
హుసేన్‌సాగర తీరం పర్యావరణ రహిత పచ్చదనం
వైట్ హౌస్‌తో సొగసు పోటీకి సై అంటే/ సై
అంటుంది./ భారత రాజ్యాంగం నిలువెత్తు రూపం
ప్రతిష్ఠించిన అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం
భారతదేశానికే తలమానికం.
తెలంగాణ తల్లిని
జైల్ నుండి విడిపించి
కన్నీరు తుడిచిన కన్నబిడ్డలే మంగళ స్నానాలు చేయించారు.
మేళతాళాలతో సుగంధ పరిమళాలు చిలికించారు.
ఐరావతముపై ఎక్కించి ఇంద్రభవనము తలపించే
ఇంటికి తీసుకొని వస్తున్నారు/ ముక్తకంఠంతో జై తెలంగాణ
నినాదాలతో/ ప్రపంచమంతా మార్మోగుతుంది
తెలంగాణ పోరాట యోధులు అమరజీవులై
కన్నతల్లి ఒడిలో నిద్రపోతున్నారు
వారి స్మారక స్థూపాలు నిత్యం మనముందు
చలాకీగా కదలాడే రూపాలు/
సచివాలయము సొగసు చూడతరమా!

**- పూసాల సత్యనారాయణ**

# రైతే రాజు

నాడు నా దేశం 'రైతన్న'పాలిట వరాల రాజ్యం
వ్యవసాయానికి పెద్ద పీట వేసి అక్కున చేర్చుకున్న దేశం



హలాలు పట్టి, పొలాలు
దున్ని, దుక్కి-అందరికి
అన్నం పెట్టిన రారాజు!/ నేడు నా దేశం రైతన్నకు భరోసా ఇవ్వలేని రాజ్యం
ఎన్ని పథకాలు వస్తే ఏం.. ప్రణాళికల్లో స్థానం కదా కావాల్సింది
రాజుగా బతికిన రైతు-నేలనే నమ్ముకుని నేలపాలవుతున్నాడు
ఆగని ఆత్మహత్యలతో అంతమవుతున్నాడు
ప్రపంచీకరణలో భాగంగా ఎన్ని సంస్కరణలు చేసినా
మనిషి ఆధునిక అభివృద్ధికే కానీ/ అవి రైతు కళ్లలో ఆనందం తెస్తున్నాయా?
కష్టించి, చెమటోడ్చి-పంట చేతికొచ్చాక గిట్టుబాటు ధరలు రాక
అలమటిస్తున్న రైతుకు ఇకనైనా ఆసరా కల్పిద్దాం..
లేకుంటే మనకు రేపు లేదని గ్రహిద్దాం!/ దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పోరాడే
సైనికుడి/ ఆకలి తీరాలన్నా హాలికుడే కదా కావాల్సింది-అందుకే
ఆకలి తీర్చే రైతు ఎల్లప్పుడూ 'రాజే' మనందరికీ.

**- న్యాలకంటి నారాయణ**

## ఈవారం కవిత్వం

# పల్లె

గుడిసెలు కాలిపోతున్న
దళిత వాడలా
దూరంగా ఎర్రబడ్డ
సూర్యాస్తమయం
పై నుంచి ఎవరో బుక్కా చల్లినట్టు
పల్చగా జారుతున్న చీకటితెర
కాలవలో ఆ పక్క ఆఖరిసారి
వల విసురుతున్న జాలరి.
ఇంట్లో దీపం ముట్టించడానికి
కిరసనాయిలు బుడ్డి పట్టుకొని
కొట్టుకు బయల్దేరిన ముసిల్ది.

**- భూషి కృష్ణదాసు**



# సమాజత్వం పెల్లుబికే మంచికథలు



ఒక మంచి కథకు నిర్వచనం ఆ కథను చదివాక అది పదేపదే గుర్తుకు రావాలి. కథలోని పాత్రలో, సంభాషణలో, కొటేషన్‌లో పదేపదే గుర్తుకు రావాలి. అలాంటి 23 మంచి కథలను 'మంచుకింద ఉక్కపోత' శీర్షికతో మనకందిస్తున్నారు అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు విభాగం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న డా॥సుబ్బారావు. రాశి కంటే వాసి ప్రధానమని నమ్మి, ఆచరించే వీరి కథలన్నీ వాసిగాంచినవే! మనసుకు హత్తుకుపోయి మనలో ఆర్ద్రతను నింపుతాయి. 'తెగిన గాలిపటం'లో సాయవ్వను, 'దేవుడి భార్య'లో దేవమ్మను చదువుతుంటే హృదయం ద్రవించి పోతుంది. కథ ముగించాక కూడా వీళ్లు, వీరి దయనీయ జీవితాలు మనల్ని వేదనకు గురిచేస్తాయి. బంగారానికి తావి అద్దినట్లు రచయిత నిశిత పరిశీలన, పోలికలు, అలంకారాలు, పటం కట్టి నిలుస్తాయి. బతుకే ఒక ఆటగా బతికి చివరకు బతుకాటలోనే ఓడిపోయిందట సాయవ్వ! (పే14). పేదరికం అమావాస్య చీకటిలా ఇల్లంతా పరుచుకుని ఉందట (పే16). ఆమె ఇంట్లో ఉండలేని దీపాలు సర్కారువారి సాయంలా ఉన్నాయట! (పే 18). చినుకులుగా మొదలైన వాన 'గుత్తులుగుత్తులుగా' కురవసాగిందట (పే: 22). చాలా అపురూపమైన పోలిక. పగలంతా అరుచుకోవటం రాత్రి కరుచుకోవటం కవితాత్మక ప్రాసపదాల ప్రయోగం. 'చేతులతో మెడగట్టిగా పట్టి వదలుతున్నట్లు చల్లగాలి ఉక్కిరిబిక్కిరి చేయటం' స్వానుభవం అయితే తప్ప సాధ్యపడని పోలికలు- (పే30) కథల్లోని పాత్రలనే కాదు, చదివేవారినీ కూడా ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఎత్తుగడ, కథాక్రమం, ముగింపు అన్నింటి మీద ప్రత్యేక దృష్టిపెట్టి రాసిన కథలు. 'అనుభవాలే' అనిపించే కథలు. **(మంచు కింద ఉక్కపోత, రచన: డా॥జడా సుబ్బారావు, వెల: రూ 200, ప్రతులకు: తెలుగుడిపార్ట్ మెంట్, ఆర్‌జి యుకెటి, నూజివీడు, ఏలూరు)**

**- కూర చిదంబరం**

# విపంచి మీటిన ప్రణయరాగాలు

విశ్రాంతి ఉపాధ్యాయుడు వక్కా రాజేంద్రప్రసాద్ 'ప్రణయవిపంచి'ని మీటుతూ 34 రాగాలను (కవితలను లేదా గేయాలను) వినిపిస్తున్నాడు. 'కాదు నేను కాముకుడ్ని/ భావవీచికల తేలియాడే భావుకుడ్ని/ ప్రేమను పూజించే ప్రేమికుడ్ని' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటున్నాడు. ఏడాదిలో ఒక్కరోజేనా ప్రేమికుల రోజు? 'నిజమైన ప్రేమకు/ లేదుకదా ఏదో ఒకరోజు/ ప్రతిరోజు-ప్రతిగంట/ ప్రతిక్షణము- ప్రేమికులదే' అంటున్న ఈ కవి



ఊహల, కల్పనల, పరిశీలనల, ప్రేరణల, సృజనాత్మక కలల, కోరికల, అనుభవాల మేళవించి కవితల్ని అల్లి మనకందిస్తున్నాడు. రాజేంద్రప్రసాద్ కవిత్వంలో ప్రియురాలి పట్ల ఆరాధన, ఆమె రాక కోసం నిరీక్షణ, ఆమె లేక విరహవేదన, ఆమెను స్తుతిస్తూ ప్రణయాలాపన నివేదన, చిపిరిల్లుతూ పాఠకుల్ని తన్మయత్వంలోకి నెట్టేస్తాయి. ఈ కవికి స్త్రీమూర్తి అంటే ఒక పవిత్రభావన. యింతకీ ఎవరీ స్త్రీమూర్తి? జీవిత భాగస్వామి కావొచ్చు.. గాఢంగా ప్రేమించిన ప్రియురాలు కావొచ్చు లేదా ఊహాసుందరి కావచ్చు. పాఠకుల ఊహకే వదిలేస్తాడు. 'సింపుల్‌గా, నార్మల్‌గా, నావెర్‌గా, కూల్‌గా, పవర్‌ఫుల్‌గా, హార్ట్‌ఫుల్‌గా అలరిస్తున్న 'చిన్నదాని మెరుపుల్'ని మనకళ్లముందు సాక్షాత్కరింప జేస్తాడు. 'ప్రకృతికి ప్రతిరూపం స్త్రీ' అంటు, 'నవరసాల ఆమె నాభి తన సరసాల ఊబి' అంటూ పరవసిస్తాడు ఈ కవి. భావోద్వేగానికి అద్దంపట్టు ద్వారకనాథ్ గీసిన చిత్రాలు కవితల్ని మరింత శోభయమానం గావించినవి అనడంలో అతిశయోక్తి లేదు.

**(ప్రణయ విపంచి, రచన: వక్కా రాజేంద్రప్రసాద్, వెల: రూ 100, ప్రతులకు: ప్లాట్ నం.216, డి బ్లాకు, 2వ అంతస్తు, మహాలక్ష్మి రెసిడెన్సీ, నారాయణపురం, తిరుపతి)**

**- రమణ వెలమకన్ని**

**పుస్తక సమీక్ష**

# నర్మదారెడ్డి రమణీయ పర్యాటకం

'అంతర్జాతీయ నదీతీరంలో మా నడక', విశ్వభ్రమణకారిణి, నిర్విరామ పర్యాటకరాలుగా ప్రపంచంలోని 178 దేశాలు చుట్టివచ్చిన డా॥నోముల నర్మదారెడ్డి రచించిన యాత్రాకథనం యిది. 'ఆగదు మా ప్రయాణం', 'కొలంబస్ అడుగు జాడల్లో', 'యుద్ధ క్షేత్రాలలో మా ప్రయాణం' మూడు యాత్రా రచనలతో తెలుగునాట, పర్యాటక రంగంలో అలుపెరుగని బాట సారులుగా ఇంద్రా, నర్మదారెడ్డి దంపతులు చరిత్ర సృష్టించారు. నదీనదాల మీద, మైదానాల మీద, పచ్చికబయళ్లమీద, సెలయేళ్లమీద జలపాతాలమీద రెక్కలు విప్పి స్వేచ్ఛగా విహరించే ఈ జంట సుదూర నదీ దేశతీరాలలో, పర్యటించిన కథనం, ఈ పుస్తకం ప్రత్యేకంగా వివరిస్తోంది. ప్రపంచ ప్రసిద్ధి కెక్కిన నయాగరా, ఇగ్వాజ, విక్టోరియా జల పాతాలు, అత్యంత పొడవైన నైలునది, అతివెడల్పైన అమెజాన్, జాంబియా, ఇరవాడ నదీ తీరాల రమణీయ ప్రకృతి సౌందర్యాన్ని స్వయంగా సందర్శించిన వీరి అనుభూతుల, చదువరులకు పరవశం కలిగిస్తున్నాయి. శతాధికంగా దేశాలను ప్రపంచపర్యాటక యాత్రాభిలాషతో సందర్శించిన ఈ దంపతులు, 2019, 2020లలో నైలునదీ తీరం వెంట, ఉగాండా, ఈజిప్టు, ఇథియోపియా, పెరు, ఈక్వెడార్, బ్రెజిల్ సందర్శించారు. అదే విధంగా జాంబెజీ నదీతీరంలో, జింబాబ్వే, నమీబియా, క్యాయు-సునది, వెంబడి సిల్క్‌రూట్‌లో కజికిస్తాన్, కర్గిస్తాన్, తజకిస్తాన్, ఇరావడీ నదీ తీరంలోని మాం



డలే, బగాన్, చౌక్, యెన్నాగ్యూంగ్, న్యాయూంగ్ సందర్శించారు. పర్యాటక ఆకాంక్షతో, సాహసమే ఊపిరిగా డా॥ నర్మదారెడ్డి సమాజసేవా కార్యకర్తగా ఆదర్శ ప్రాయమైన మహిళగా తమ యాత్రానుభూతులలో, వైవిధ్య రచనలతో సాగిపోతున్నారు. **(అంతర్జాతీయ నదీతీరాలలో మా నడక, రచన: డా॥నర్మదారెడ్డి, వెల: రూ 225, ప్రతులకు: ఇ.నం. 1-92/5, స్ట్రీట్ నెంబరు-1, హబ్సిగూడ, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**

విద్యార్థులకు పరీక్షలు అయిపోయాయి. పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులు ఉన్నారు. అయితే చాలామందికి వేసవి సెలవులొస్తున్నాయి. కుటుంబసభ్యులంతా ఏదైనా టూర్‌కు ప్లాన్ చేసుకుంటూ ఉండొచ్చు. ఇలాంటి వారికి గోవా, నైనిటాల్, రిషికేశ్, గ్యాంగ్‌టక్, మౌంట్ అబూ టాప్-5గా ఉన్నట్టు ఓ సర్వేలో తెలిసింది. దాదాపు 65శాతం తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి వేసవి సెలవులకు ట్రిప్ ప్లాన్ చేద్దామని భావిస్తున్నట్లు ఆ సర్వేలో తేలింది. ప్రజల్లో కూడా కరోనా భయం పోయింది. దీంతో అంతా కలిసి ఎక్కడికైనా వెళ్తేబాగుంటుందని అనుకుంటున్నారు. ఫ్యామిలీ టూర్లకు ఏయేప్రాంతాలు, దేశాలు బాగుంటాయో గమనిద్దాం.



# సెలవుల్లో టూర్ ప్లాన్



వివిధ దేశాలకు వెళ్లే పర్యాటకుల రద్దీ పెరగడంతో టూర్ ఆపరేటర్లు, పర్యాటక సంస్థలు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి లండన్‌కు వెళ్తున్న పర్యాటకులు అక్కడి నుంచి పారిస్, స్విట్జర్లాండ్, వెనీస్, ఆస్ట్రియా, ఇటలీ, జర్మనీ తదితర దేశాలను సందర్శిస్తున్నారు. ఒకే పాస్‌పోర్టుపైన ఎక్కువ దేశాల్లో పర్యటించేందుకు అవకాశం లభించడం వల్ల కూడా చాలామంది యూరప్‌కే ప్రాధాన్యతనిస్తున్నారు. అద్భుతమైన పర్యాటక నగరంగా పేరొందిన పారిస్‌కు ఈ ఏడాది అనూహ్యమైన డిమాండ్ ఉన్నట్లు టూర్ ఆపరేటర్లు చెబుతున్నారు. మరోవైపు ఇటలీలోని పురాతన నగరాలు, చారిత్రక కట్టడాలను సందర్శించే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. 'పర్యాటకుల డిమాండ్ పెరగడతో వీసాలు లభించడం కూడా కష్టంగా మారింది. కనీసం నెల రోజులు ముందే స్లాట్ బుక్ చేసుకోవలసి ఉంటుంది.

## పెరిగిన అన్ని చార్జీలు

రెండేళ్ల నష్టాలను పూడ్చుకొనేందుకు ఎయిర్‌లైన్స్ బారులు తీరాయి. కొవిడ్ నిబంధనల సడలింపుతో మొదట పరిమితం గా సర్వీసులను ఏర్పాటు చేసిన సంస్థలు క్రమంగా వివిధ ప్రాంతాల నుంచి విమాన సర్వీసులను పెంచాయి. ప్రయాణికుల రద్దీ పెరడగంతో విమాన చార్జీలకు సైతం రెక్కలొచ్చాయి. యూరప్ దేశాలకు సర్వీసులను నడుపుతున్న పలు ఎయిర్‌లైన్స్ 20శాతం నుంచి 22 శాతం వరకు చార్జీలు పెంచాయి. అలాగే హోటళ్లు, స్థానిక రవాణా చార్జీలు కూడా కొవిడ్ అనంతరం పెరిగాయి. దీంతో నగరానికి చెందిన టూర్ ఆపరేటర్లు సైతం ప్యాకేజీ చార్జీలను అమాంతంగా పెంచారు. గతంలో రూ. 60వేల నుంచి రూ 70 వేల వరకు ప్యాకేజీ ఉంటే ఇప్పుడ ఏకంగా రూ.1.5 లక్షల వరకు పెరిగింది. కొవిడ్ అనంతరం అన్ని ధరలు పెరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

## నకిలీ ఏజెంట్లను నమ్మొద్దు

టూర్ ప్యాకేజీల ఎంపిక సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆన్‌లైన్‌లో కనిపించే ప్యాకేజీలను నమ్మరాదు. తెలిసిన సంస్థల వద్దకు స్వయంగా వెళ్లి అన్ని వివరాలు తెలుసుకొని సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే ప్యాకేజీలు బుక్ చేసుకోవాలి.

## అందాల శ్రీలంక

శ్రీలంక ప్రధాన ఆదాయ వనరు పర్యాటకమే. ప్రకృతి అందాలకు కొదవలేదు. చుట్టూ నీళ్లు, మధ్యలో శ్రీలంక ప్రత్యేకంగా అనిపిస్తుంది. కనీసం పదిరోజులు పర్యాటకం చేయాలనుకునే వారికి ఇది సరైన ప్రదేశం. అదీ లక్ష రూపాయల బడ్జెట్‌లో విశాలమైన తేయాకు తోటలు, ఆకుపచ్చ చీర కప్పుకొన్నట్టుగా కనికట్టు చేసే పర్వతాల నడుమ రైలు ప్రయాణం మాటల్లో వర్ణించలేని అనుభవం. లోయలు, కొండలు, గుట్టలు, అడవులు, సరస్సులు, నదులు, జంతువులు, పక్షులు. వీటన్నిటినీ తిలకిస్తూ రైలులో సుదీర్ఘ ప్రయాణం చేయవచ్చు. సూర్యాస్తమయ సమయాల్లో సముద్రతీరాల్లో గడపడానికి ఉవ్విళ్లూరుతారు పర్యాటకులు. శ్రీలంకకు హాలీ ట్రిప్ వెళ్లడానికి ఓ సీజన్‌లోనైనా బాగానే ఉంటుంది. పెద్దగా ఉండదు. కొలంబో, క్యాండీ, ఎల్లా, తంగల్లె ప్రదేశాలను టూర్‌లో భాగంగా చుట్టి రావచ్చు. లిటిల్ ఆడమ్స్ పీక్‌లో కనిపించే ప్రకృతి సౌందర్యం.





## సుందర కట్టడాల దుబాయ్

దుబాయ్‌ని చూడాలని కోరుకోని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ప్రపంచపర్యాటక కేంద్రం దుబాయ్ అని చెప్పవచ్చు. షాపింగ్ ప్రియులకు స్వర్గధామం. ముఖ్యంగా రాత్రుళ్ల విద్యుద్దీపకాంతుల్లో వెరిసిపోయే దుబాయ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆల్ టైం ఫేవరేట్ హాలిడే డెస్టినేషన్‌గా దుబాయ్ గుర్తింపు పొందింది. దుబాయ్, అబుదాబీ, షార్జా నగరాలను చుట్టి రావడమంటే ఖరీదైన వ్యవహారంగా చెబుతారు. కానీ ముందుగా ప్లాన్ చేసుకుంటే లక్ష రూపాయల్లో ఎమిరేట్స్ అందాలను చూసి రావచ్చు. ఎడారి అందాలు తిలకించడం, సఫారీ, బుర్ ఖలీఫా, మిరాకిల్ గార్డెన్, అజ్మాన్ మ్యూజియం, స్నోబీఐలాండ్ మొదలైనవి చూడదగినవి.

## ఆకట్టుకునే వియత్నాం

రెండు దశాబ్దాల పాటు యుద్ధంలో నలిగి పోయిన ఈ దేశంలో ప్రకృతి సౌందర్యానికి కొదువలేదు. హలాంగ్ బే అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఒక్కసారైనా చూసితీరాలి.. అనిపించేలా ఉంటుందా ప్రదేశం. సముద్రంలో అక్కడక్కడ నిట్టనిలువున నిల్చున్నట్లున్న సున్నపురాయి గుట్టల్లాంటివి ప్రత్యేక ఆకర్షణ, నీళ్లలో కయాక్‌లపై ప్రయాణించడం, స్క్యూబాడైవింగ్, రాక్ క్లయింబింగ్, హైకింగ్ వంటివన్నీ ఆకట్టుకుంటాయి. చిన్నచిన్న బోట్లలో షికారు మధురానుభూతిని మిగిలిస్తుంది. ప్రజా రవాణాను ఉపయోగించడం, వీధుల్లో విక్రయించే ఆహారపదార్థాలను ఎంచుకోవడం చేస్తే చాలా తక్కువ బడ్జెట్‌లో వియత్నాం అందాలను చూసి రావచ్చు. టూర్‌కు వెళ్లే ముందే పక్కాగా ఎంపిక చేసుకున్న ప్రదేశాలకు పరిమితమైనప్పుడే అనుకున్న బడ్జెట్‌లో సాధ్యం అవుతుంది. లేకపోతే వియత్నాం పర్యాటకం కాస్త ఖరీదైనదే! ఇక్కడ చారిత్రక ప్రదేశాలు, పురాతన కట్టడాలు, స్మారక చిహ్నాలు చూసి తీరాల్సిందే. వియత్నాంలో దేవాలయాల సంఖ్య కూడా ఎక్కువే. చరిత్రను ఇష్టపడేవారు తప్పనిసరిగా సందర్శించాల్సిన దేశం ఇది.





## సింగపూర్

అత్యాధునిక వసతులు, సౌకర్యాలతో నిర్మితమైన అద్భుతం సింగపూర్. ప్రపంచ చిత్రపటంలో గ్లోబల్ వర్క్ ప్లేస్ అని చెప్పుకోవచ్చు. ప్రఖ్యాత సంస్థల కార్యాలయాలన్నీ ఇక్కడ కొలువుతీరాయి. నగరం ఎప్పుడూ కడిగిన ముత్యంలా మెరిసిపోతూ ఉంటుంది. క్రమశిక్షణకు మారుపేరు. శుభ్రత చెప్పనక్కర్లేదు. ఇన్ని విశిష్టతలు కలిగింది కాబట్టి..విదేశ హాలిడే ట్రిప్ అనగానే ముందుగా గుర్తొచ్చే పేరు సింగపూర్. పర్యాటకులకు చక్కటి సంతృప్తి ఇస్తుంది. చౌకధరల్లో వసతి కోసం హాస్టల్స్, ఎయిర్‌బిఎన్‌బిని ఎంచుకోవచ్చు. యూనివర్సల్ స్టూడియో, మెరీనా బేశాండ్స్, నైట్ సఫారీ, సింగపూర్ రివర్ క్రూయిజ్, గార్డెన్స్ బై దబే వంటి ప్రదేశాలు తెగ నచ్చేస్తాయి. ఓపెన్‌టాప్ బస్సులో సింగపూర్ అందాలను తిలకించవచ్చు. చైనాటౌన్, లిటిల్ ఇండియాలను చూసి తీరాల్సిందే. లిటిల్ ఇండియాలో తమిళులు, తెలుగువాళ్ల దుకాణాలు కనిపిస్తాయి. ఇడ్లీ, వడ, దోశ, భోజనం..ప్రతిదీ దొరుకుతుంది. సెంటోసా ఐలాండ్స్, కేబుల్ కార్,రివర్ సఫారీ, జూ,యూనివర్సల్ స్టూడియోస్ వంటి ప్రదేశాలు సింగపూర్‌లో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ❑



కథ

# కాలం చేజారితే

తనకున్న కొద్దిపాటి పంట భూమిని సాగు చేసుకుంటూ గోవిందుడు శింగనబంధు గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. పెళ్లి అయిన ఐదుసంవత్సరాలకు కొడుకు పుట్టాడు. రాము అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగారు. రాముకి ఐదుసంవత్సరాల వయస్సు దాటిందని ఊరిలో ఉన్న బడిలో చేర్పించారు. కాని రాముకున్న బద్ధకం, వాయిదా మనస్తత్వం వలన ఏళ్ల గడుస్తున్నా చదువులో రాణించలేకపోయాడు. బడికి వెళ్లకుండా అల్లరిపిల్లలతో కలిసి తిరుగుతూ, విలువైన కాలాన్ని వృధా చేసేవాడు. కొడుకుని ఎలా దారిలో పెట్టాలో గోవిందుడికి అర్థంకాక దిగాలు పడిపోతూ ఉండేవాడు.

ఒకనాడు రాము మేనమామ నరసింహం పట్నం నుండి శింగనబంధ వచ్చాడు అక్కనూ, బావనూ చూడాలని. బావ ద్వారా రాము ప్రవర్తనను తెలుసుకున్న నరసింహానికి బాధనిపించింది.

'బావా! ఇప్పుడైనా మించిపోయింది ఏమిలేదు, రాముని నాతోపాటు పట్నం తీసుకుపోయి, అక్కడ మంచి స్కూల్లో చేర్పిస్తాను' అన్నాడు.

నరసింహం అలా అనేసరికి, 'నా కొడుకు నా దగ్గరే, మాతోపాటు ఉంటాడు. వాడిని ఎక్కడికి పంపించను' అని రాము వాళ్లమ్మ నిక్కచ్చిగా చెప్పేసరికి, నరసింహం మిన్నకుండిపోయాడు. కొన్నాళ్లు గడిచాయి. రాము వయసు పెరుగుతున్నాసరే అతనిలో మార్పు కనిపించలేదు.

ఒకరోజు ఊరి చివర ఉన్న ఆశ్రమానికి సాధువు వచ్చారని, అందరి కష్టాలు, బాధలు విన్న తరువాత సరైన సలహాలు చెప్పడమే కాకుండా, అవసరమైన వారికి జ్ఞానబోధ చేస్తున్నారని ఆనోటా ఈనోటా విన్న గోవిందుడు అక్కడకు వెళ్లాడు. అక్కడ తన కొడుకు గురించి చెప్పి ఎలాగైనా వాడి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని ప్రాధేయపడ్డాడు.

'ఒకసారి మీ అబ్బాయిని నా దగ్గరకు పంపించండి. వారంరోజులు ఇక్కడే ఉంటాడు. నేను చూసుకుంటాను' అని భరోసా ఇచ్చి పంపించాడు సాధువు.

మరుసటి రోజు రాము తన తండ్రి మాట మేరకు సాధువు దగ్గరకు వెళ్లాడు. కాసేపు మాట్లాడిన సాధువు రాము తీరును అర్థం చేసుకున్నాడు.

'రెండు రోజులు నా పక్కనే కూర్చో' అని చెప్పి..రాముని క్రమం తప్పకుండా వేళకి భోజన ఏర్పాట్లు గావించండి' అని తన శిష్యబృందానికి అప్పజెప్పాడు సాధువు.

మూడవరోజున రాముని పిలిచి 'మన ఆశ్రమానికి ఎదురుగా ఉన్న పూల మొక్కలకు పూసిన పువ్వులని తెంపి, వాటితో దండగుచ్చి ఆశ్రమంలో ఉన్న విగ్రహానికి ప్రతిరోజు వెయ్యమని' చెప్పారు సాధువు.

'అలాగే' అన్నాడు రాము.

రెండురోజులు గడిచిన తర్వాత, మూడవరోజున పువ్వులను తెంపుకుని తిరిగి వస్తున్న రాముతో ఎదురెళ్లిన సాధువు 'ఏం, కొన్ని పువ్వులను తెంపకుండా వదిలేసావు?' అని అడిగారు.

'అవి నాకు అందకపోవడం వలన తెంపలేదు, అయినా అవి రెండురోజుల క్రిందటివి. వాడిపోయాయి కూడాను, దండ గుచ్చడానికి పనికిరావు' అన్నాడు రాము.

రాము అలా అనేసరికి సాధువు నవ్వుతూ ప్రతిపూల మొక్క దగ్గరకి వెళ్లి ఊపసాగారు. వాడిన పువ్వులు అన్నియు నేలమీద పడ్డాయి. 'చూడురాము నీకు అందలేదని, విడిచిపెట్టిన వాడిన పువ్వులు దండ గుచ్చడానికి పనికిరాలేదో? మనిషి జీవితం కూడా అంతే. వయసు పెరుగుతున్నకొద్దీ శరీరంలో పటుత్వం తగ్గి, చివరికి ఎవరికీ పనికిరాకుండా అయిపోతాం. అందుకే ఎప్పుడు చెయ్యవలసిన పని అప్పుడే చేసి, జీవితం సార్థకం చేసుకోవాలి' అంటూ రాముకు హితబోధ చేశారు సాధువు.

సాధువు మాటలకి రాము చలించిపోయాడు. తనకు తన తప్పు తెలిసింది. సకాలంలో చేసే సక్రమమైన పని సత్ఫలితానినిస్తుంది అని గ్రహించి, ఆ రోజు నుంచి బద్ధకాన్ని, వాయిదా మనస్తత్వాన్ని వదిలి, రోజూ బడికి వెళ్తూ బుద్ధిగా చదువుకోవటం ప్రారంభించాడు. రాము మారినందుకు, గోవిందుడు ఎంతో ఆనందించాడు.

- కె.కాశీవిశ్వేశ్వరరావు



# చిన్నారుల చిన్ని ప్రపంచం

వార్త ఆదివారం

## బాలగేయం

### జొన్న రొట్టె



రొట్టెమ్మ రొట్టె
జొన్న రొట్టె
అమ్మ చేసింది
జొన్న రొట్టె
పప్పమ్మ పప్పు
కందిపప్పు
అమ్మ చేసింది
కందిపప్పు
రొట్టెపైన పప్పు
పెట్టింది అమ్మ
చేతికి నాకు
ఇచ్చింది అమ్మ
పప్పురొట్టె
తింటుంటే రుచి
రోజు తింటే
భలే పుష్టి

**- పల్లోని శేఖర్‌బాబు**



## హలో ఫ్రెండ్...


**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.ఎస్.మధులిక,** కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'వైరస్' అంటే ఏమిటి?



**జవాబు: మధులిక!** పలురకాల వ్యాధులను వ్యాపింపచేసే సూక్ష్మజీవులను 'వైరస్' అంటారు. వీటిని మైక్రోస్కోప్ ద్వారానే గుర్తించడానికి అవకాశం ఉంది. వైరస్‌లు అనేక రకాలలో ఉంటాయి. అతి సూక్ష్మమైన వైరస్ అంగుళంలో మిలియన్ వంతు ఉంటుంది. ఇవి దాదాపు అన్ని జీవరాశులలోనూ వుండి వ్యాధులను వ్యాపింపచేస్తాయి. మనుషులకే కాదు, జంతువులకు, చెట్లను కూడా ఇవి అంటిపెట్టుకుని వుండి, అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలలోనే మరణిస్తాయి. కొన్ని పరమమొండి వైరస్‌లకు మాత్రం ఉష్ణోగ్రత ప్రభావానికి ఏమాత్రం చలించే స్వభావం ఉండదు. ఈ తరహా వాటిని చంపడానికి హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని, క్లోరిన్‌ను వాడుతుంటారు. వైరస్ వల్ల మనకు కలిగే వ్యాధులకు నివారణ నిమిత్తం చిట్టచివరిగా యాంటి బయాటిక్స్‌ను వాడుతుంటారు.

**- సి.కార్తిక్,** హైదరాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'సినిమా' అన్న పదం ఎలా వచ్చింది?

**జవాబు: కార్తిక్!** గతంలో మద్రాస్ నుంచి 'కినిమా' పేరుతో ఒక సినిమా పత్రిక వెలువడేది. 'కినిమా' అంటే గ్రీకు భాషలో 'చలించు' అని అర్థం. 'చలించు'తున్న బొమ్మలు(ఫొటోలు) ఒక పట్టిక ముద్రించి వాటిని తిరిగి ప్రదర్శించినప్పుడు కదులుతున్న బొమ్మలుగా చూపించే యంత్రాన్ని లూమియర్ సోదరులు(ఫ్రెంచ్ దేశస్థులు) 1890లో కనుగొన్నారు. అప్పుడు ఈ యంత్రానికి 'సినిమాటోగ్రాఫ్' అని పేరు పెట్టారు. ఈ యంత్రం ద్వారా కదిలే బొమ్మలకే 'సినిమా' అనే నామకరణం జరిగి 'సినిమా' అనే పదం భారతీయ భాషల్లో స్థిరపడింది.





# మేం కొని పంపిస్తాం

సౌరబ్‌గుప్త కెనడాలో చదువుకుంటున్నాడు. కానీ ఇండియా రుచులంటేనే ఇష్టపడతాడు. పండుగలప్పుడు అమ్మ చేసిన వంటలే గుర్తుకు వస్తాయి. వాటిని తినాలనిపిస్తుంది. కానీ అవి దొరకవు...ఇది ఒకప్పటి మాట, కానీ ఇప్పుడు మీకు కావాల్సినవి అందించేందుకు కొన్ని సంస్థలు పనిచేస్తున్నాయి తెలుసా? యువర్‌దేశీకార్ట్, ఫార్వర్డ్ పార్సెల్, షాప్‌ఫ్రీ లాంటి వెబ్‌సైట్లు ఉన్నాయి. వీటి ప్రత్యేకత ఏంటీ అంటే? మామూలుగా అయితే ఇంట్లో ఎవరో ఒకరు షాపింగ్ చేస్తూ, మనవాళ్లకు కావాల్సిన వస్తువుల్నీ, దుస్తుల్నీ కొంటుంటారు. అదే మనదగ్గరుండే ఈకామర్స్ షాపింగ్ వెబ్‌సైట్ల నుంచైనా, లేదంటే స్వయంగా మనమే దుకాణాలకు వెళ్లైనా సరే, దాని




కోసం సమయమూ, ఓపికా కావాల్సిందే. పైగా బయట షాపింగ్‌కి తిరిగి రావడానికి ప్రయాణ ఖర్చులూ అవుతాయి. అన్నింటి కన్నా ముందు కచ్చితంగా అందుకోసం మనకు వీలూ కుదరాలి మరి. ఇలా అన్నీ కొన్నాక వాటిని ప్యాక్ చేయించి కొరియర్ సంస్థల ద్వారా విదేశాలకు





పంపాల్సి ఉంటుంది. పైగా ఇదంతా మనకోసం ఎవరైనా చేసిపెట్టేవాళ్లు ఉన్నప్పుడు సంగతి. అదే ఇంట్లో పెద్దవాళ్లు మాత్రమే ఉన్నా.. మనకోసం తిరిగి షాపింగ్‌చేసేవాళ్లు అందుబాటులో లేకపోయినా ఎలా..అలాంటప్పుడు ఈ వెబ్‌సైట్లను ప్రయత్నించి చూడొచ్చు. ఈ వెబ్‌సైట్లలో లాగిన్ అయి వీళ్లు అందించిన లాకర్ అడ్రస్‌కు ఆన్‌లైన్ సైట్ల ద్వారా మనం షాపింగ్ చేసిన వాటిని నేరుగా వీళ్లకు పంపొచ్చు. లేదంటే 'పర్సనల్ షాపర్ సర్వీస్'ను ఎంచుకుని మనకు అవసరమైన వస్తువుల్ని చెబితే వాళ్లే కొనిపెడతారు. పంపడానికి వీలున్న ఏ వస్తువు అయినా సరే మనకోసం షాపింగ్ చేసి పెడతారు. పట్టుపరికిణీలూ, డ్రెస్సుల్లాంటివి కుట్టించడం దగ్గర్నుంచి సున్నుండలూ, చకినాలూ, పచ్చళ్ల వరకూ ఏది కావాలన్నా అమర్చుతారు. అవసరమైతే మనవాళ్లెవరైనా పంపాలనుకున్నవీ వీళ్లకు అందించొచ్చు. పంపడానికి ముందే ప్రతి వస్తువునూ ఫొటో తీసి పంపుతారు. అవి సరిగా లేకపోతే వెనక్కి పంపేయొచ్చు. అన్నీ కలిపి ప్రత్యేకంగా ఒక దగ్గర సరిగా ప్యాక్ చేసి విదేశాల్లో ఉన్నవాళ్లూ వీటి ద్వారా షాపింగ్ చేసి పంపొచ్చు. ఇక్కడే ఉన్న వాళ్లకే సర్‌ప్రైజింగ్‌గా కొరియర్ చేయొచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే మన ఇంట్లో వాళ్లు చేయ గలిగితే పనులన్నీ చేసిపెడతారు. వెబ్‌సైట్లో ముందుగానే వీటన్నింటి వివరాలతో పాటు ఒక్కో సర్వీస్‌కి ఇంత ధర అని ఉంటుంది. యాప్‌తో పాటూ ఇతర సోషల్ మీడియాల్లోనూ ఈ సంస్థల వేదికలు అందుబాటులో ఉన్నాయి. మన అవసరమూ, వీలునూ బట్టి వీటి సేవలు ఉపయోగించుకోవచ్చు.







# సింగపూర్‌లో ఉన్నతవిద్య

**మనదేశం నుండి విదేశాలలో చదవడానికి చాలామంది విద్యార్థులు అక్కడికి వెళ్తున్నారు. అలా మన దేశానికి దగ్గరలో ఉన్న సింగపూర్‌కి వెళ్లడం ప్రారంభించారు. మొదట్లో మనకి వృత్తి వ్యాపారం కోసం సింగ్‌పూర్‌తో సంబంధాలు పెట్టుకుంది మనదేశం. పొరుగున ఉన్న తమిళులు ఇక్కడ ఎక్కువ. సింగపూర్ చిన్నదేశం.**



సుమారు 800 చదరపు కిలోమీటర్ల వైశాల్యం అరవై ద్వీపసమూహాలతో 60 లక్షల జనాభాతో ఉన్న దేశం. కేవలం టూరిజం వలన ఆదాయం పెంపొందించుకుని ఆర్థికంగా బలపడిన దేశం ఇప్పుడు ఆధునిక విద్యారంగంలో పేరుపొందింది. సుమారు లక్షమంది విదేశీ విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. సింగపూర్‌లో సైన్స్, టెక్నాలజీలో మంచి విద్యావిధానం లభిస్తోంది. ఇది గొప్ప మార్పు, ఆదాయం కూడా. ఇక్కడ విద్యాభ్యాసం ఎంచుకోబోయే వృత్తికి అనుగుణంగా ఉంటోంది మనదేశం. ఈ విషయంలో సమానవీయలోపం ఉంది. న్యూరోసైన్స్, రోబోటిక్స్, నానోటెక్నాలజీ, బిగ్‌డేటా, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి రంగాలలో చదవడానికి ఆ తరువాత ఉద్యోగ అవకాశాలు సింగపూర్‌లో ఎక్కువ ఉంది. ఇక్కడి వాతావరణం మన వాళ్లకి అనుకూలంగా ఉంటుంది. ఇంగ్లీషు చక్కగా వస్తే ఇక్కడ మనకి ఎంతో సౌకర్యం కూడా. ఇక్కడ స్టూడెంట్ వీశాను స్టూడెంట్ పాస్ అంటారు. ఇమ్మిగ్రేషన్, చెక్‌పాయింట్స్ అథారిటీ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. సింగపూర్‌లో చదవడానికి అనుమతి పత్రం అడ్మిషన్ లెటర్ పాసుపోర్టు మెడికల్ సర్టిఫికెట్ వాక్సిన్ వేసుకున్న ధ్రువపత్రాలు ఇన్సూరెన్స్ ఉండాలి. ఇక్కడ ఉన్నత విద్యని అభ్యసించడాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్, సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ డిజైన్ పేరు పొందిన విశ్వవిద్యాలయాలు. సింగపూర్‌లో చదవడానికి ఒక విద్యార్థికి సుమారు 800 నుంచి 1100 సింగపూర్ డాలర్ అవసరం పడుతుంది. ఇప్పటి మారకం రేట్ 62 రూపాయలు ఒక సింగపూర్ డాలర్‌కి సమానం. ఇంకా పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ చదువుకోవచ్చు. ఒక వారంలో 16గంటలు పార్ట్‌టైం ఉద్యోగం కూడా విద్యార్థి చేసుకోవచ్చు. అలాగే రకరకాల స్కాలర్‌షిప్ పొంది చదువు కొనసాగించవచ్చు. పైగా సింగపూర్ ఇంటర్నేషనల్ గ్రాడ్యుయేట్ అవార్డు, సింగపూర్ మిలీనియం ఫౌండేషన్, లీకాంగ్ చైన్ స్కాలర్‌షిప్ వంటివి ఎన్నో ఉన్నాయ్.

**- ఈ.ఎస్.మాధవన్**

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్,**
**ఆదివారం వార్త**, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

కథ

# నన్ను మన్నించవా..!

మోని శ్రీనివాస్

సాయంత్రం ఆరున్నర..

ఆకాశం క్షణ క్షణానికి ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ చీకట్లు అలుముకుంటున్న వేళ..

నగరంలో అదో పేరొందిన పెద్ద కార్పొరేట్ పాఠశాల.

స్కూల్ విశాలమైన ఆవరణలో బాస్కెట్‌బాల్ కోర్టులో కొందరు పిల్లలు ఆడుకుంటున్నారు.

డ్రిల్‌మాస్టర్ నుదుటికి పట్టిన చెమట్లను తుడుచుకుంటూ, గట్టి విజిల్ ఊదడంతో మైదానంలో ఆడుకుంటున్న పిల్లలంతా ఒక్కసారిగా అలర్టయి ఇళ్లకు బయల్దేరడానికి సిద్ధమయ్యారు.

ఆ కుర్రాడు వంగి షూలేస్ కట్టుకుని, పుస్తకాల బ్యాగ్‌ని భుజానికి తగిలించుకొని బయల్దేరుతూ ఒక్కసారి చుట్టూతా కలయచూశాడు.

నా వంక చూడగానే నేను వేగంగా చేయి ఊపాను. నెమ్మదిగా తలొంచుకొని నా వంక అడుగులేస్తూ వస్తున్నాడు. అంతలో కొందరు కుర్రాళ్లు ఆప్యాయంగా అతని భుజాల్ని తడుతూ “కంగ్రాచ్యులేషన్స్ అనురాగ్” అంటూ అభినందిస్తున్నారు.

అందరికీ చిరునవ్వుతో “థాంక్స్’ అంటూ వీడ్కోలు పలికి నా దగ్గరకొచ్చాడు.

అనురాగ్ నా ఒక్కగానొక్క కొడుకు. నైంత్ క్లాస్. బాస్కెట్ బాల్ వాడి ఫేవరేట్ గేమ్.

అందరూ వాడిని అభినందిస్తున్నారంటే బహుశా.. ఇవాళ వాళ్ల టీం గెలిచే ఉంటుంది.

“మీ టీం గెలిచిందా?” దగ్గరికి రాగానే ఆతృతగా అడిగాను.

“అవును.. చివరి బాస్కెట్ నేను వేయడం వల్లే మా టీం గెలిచింది” అన్నాడు గర్వంగా.


అంతలోనే ఏదో గుర్తొచ్చినట్లు “డాడ్... ఇవాళ కూడా మీరు నా ఆట చూడలేదా?” అన్నాడు నా వంక అదోలా చూస్తూ.

“సారీరా.. ఆఫీసు నుంచి వచ్చేసరికి ఇదిగో ఈ టైమయింది” అన్నాను తప్పు చేసిన దోషిలా.

“హు.. మీరెప్పుడూ ఇంతే. నేను బాగా ఆడి గెలిచినప్పుడే ఆలస్యంగా వస్తారు” అన్నాడు ఉక్రోషంగా.

“సారీరా...” అంటూ వెహికల్ స్టార్ చేశాను.

పాపం.. వాడు బాగా హర్టయినట్లున్నాడు. ఇల్లు చేరేదాకా ఇద్దరం ఏమీ మాట్లాడుకోలేదు. నోరు విప్పడానికి నాకు భయమేసింది. ఈసారి ఆలస్యం కాకుండా



చూసుకోవాలి అనుకుంటూ బండివేగాన్ని పెంచాను.

ఇంటికి చేరగానే వాడికిష్టమైన బ్రెడ్ టోస్ట్ చేసి, సాస్‌తో కలిపి ఇచ్చాను.

వాడు ఆత్రంగా తినడాన్ని చూస్తుంటే అర్థమౌతోంది... వాడెంత ఆకలి మీదున్నాడోనన్న సంగతి.

“బాగా ఆకలేసినట్లుంది కదూ!” అన్నాను చిన్నగా నవ్వుతూ.

బదులివ్వలేదు. నా వంక చూసి ఊరుకున్నాడు.

టోస్ట్‌ని తింటూనే మౌనంగా ఏదో ఆలోచిస్తున్నాడు.

రాత్రి భోజనం సమయంలో వాడు మూడీగా ఉన్నాడన్న సంగతి గ్రహించి మెల్లగా స్కూల్ విషయాలు అడిగాను. అడిగినదానికే ముక్తసరి జవాబులతో, నా కన్నా ముందే భోజనం ముగించి నిశ్శబ్దంగా తన గదిలోకి వెళ్లిపోయాడు వాడు.

రాత్రి పది గంటలకు నెమ్మదిగా వాడి గది తలుపు తెరిచి చూశాను. అటు వైపుగా తిరిగి టేబుల్ ల్యాంప్ వెలుతుర్లో శ్రద్ధగా చదువుకుంటున్నాడు. వాడినలా చూస్తుంటే చాలా ముచ్చటేసింది నాకు. చదువు పట్ల వాడికున్న శ్రద్ధకు సంతోషం కలిగింది.

వాడి ఏకాగ్రతకి భంగం కలిగిస్తూ “గుడ్ నైట్ అనురాగ్” అన్నాను.

ఒక్కసారి ఉలికిపాటుగా వెనక్కి తిరిగి “సరే” నన్నట్లు తలూపాడు. అంతకన్నా మరేమీ మాట్లాడలేదు. నేను వెనక్కి తిరిగి హాల్లోకి వచ్చాను.

అక్కడ షెల్ఫ్‌లో ఉన్న ఫొటో ఫ్రేమ్‌లోంచి అందంగా నవ్వుతున్న ‘నిశిగంధ’.

“నిశి”... అప్రయత్నంగా నా పెదాలు గొణిగాయి.

ఫోటోని రెండు చేతుల్లోకి తీసుకొని నిశితంగా చూస్తుంటే కళ్ల నుండి రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి చేతి మీద. కళ్లు తుడుచుకుంటూ "మళ్లీ రావాలి నిశీ! నా జీవితంలోకి తిరిగిరావాలి. కనీసం వాడికోసమైనా.." నాలో నేను గొణుక్కుంటుంటే వెనక నుండి ఏదో శబ్దం వినబడింది.

"మమ్మీ ఎక్కడుందో నీకు తెలుసా?" అడిగాను తెలివిగా వాడితోనైనా టచ్‌లో ఉందేమోనన్న ఆశతో.

"ఆ విషయం నేనే మిమ్మల్ని అడగాలి" అని, వెంటనే "అయినా మీరింకా మమ్మీని లవ్ చేస్తున్నారా డాడ్?" అని అడిగాడు.

అటు వైపు చూశాను.

వాడు నన్నే గమనిస్తున్నాడు. అంతే.. దొరికిన దొంగలా ఫొటోని యథాస్థానంలో ఉంచేసి నా గదిలోకి దూ(పా)రిపోయాను.

మనసంతా కల్లోలమయింది. మంచమీద వాలి, "నన్ను క్షమించు నిశీ.." అని పలవరిస్తూ ఏ అర్ధరాత్రో నిద్రలోకి జారుకున్నాను.

...............

ఆరోజు..

అనురాగ్ స్కూల్ నుండి మెసేజ్ వచ్చింది. పేరెంట్-టీచర్ మీటింగ్‌కి హాజరు కావాలని దాని సారాంశం. ఇదివరకు వాడి చదువు, బాగోగులు అన్నీ నిశి చూసుకునేది. కానీ ఇప్పుడవన్నీ నేనే చూసుకోవాల్సి వస్తోంది.

అనురాగ్‌ని తీసుకొని వాడి స్కూల్‌కి వెళ్లాను. స్కూల్ ఆవరణంగా స్టూడెంట్స్, పేరెంట్స్‌తో కోలాహలంగా ఉంది.

క్యాంపస్‌లో అడుగు పెట్టగానే ప్రిన్సిపాల్ ఎదురొచ్చి "కంగ్రాచ్యులేషన్స్ శ్రీనివాస్ గారు.. మీ అబ్బాయి అనురాగ్ టాప్ ర్యాంక్ సాధించాడు" అన్నారు.

"ఓ.. థాంక్యూ సార్" అన్నాను ఆనందంగా.

"మీ అబ్బాయి ఒక్క చదువులోనే కాదు, స్కూల్ డిబేట్స్‌లో, క్విజ్‌లోనూ, ఎలక్యూషన్‌లో అన్నింట్లో మీ అబ్బాయే ఫస్టు. అంతేకాదు.. ఈ మధ్య జరిగిన ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో టీంని ముందుకు నడిపించి కప్ సాధించుకొచ్చాడు అనురాగ్.." అని ప్రిన్సిపాల్ గర్వంగా చెప్పుకుంటూ పోతున్నారు.

వారి మాటలు వింటుంటే ఆశ్చర్యంతో నాకు నోట మాట రాలేదు. మౌనంగా ఉండిపోయాను. ఎందుకంటే వాడి ఎదుగుల కోసం నేను చేసిందేమీ లేదు. దీనంతటికి కారణం ఇదివరకు వాడి తల్లి నిశి, ఇప్పుడు వాడి ప్రైవేట్ ట్యూటర్. అంతేతప్ప ఇందులో నేను చేసిందంటూ ఏమీలేదు. ఆఫీసు పనులతో పాటు, ఇంటి బాధ్యతంతా నా పైనే పడడంతో ఇక వాడి చదువు విషయంలో శ్రద్ధ తీసుకునే తీరిక, ఓపిక రెండూ నాకు లేకుండా పోయాయి.

ఆలోచనల్లో పడి నేనేమీ మాట్లాడకపోయేసరికి నా ధోరణిని గమనించి ప్రిన్సిపాల్ ఆశ్చర్యంగా "ఇంతకీ మీరు అనురాగ్ ఫాదరే కదూ!" అన్నారు అనుమానంగా.

"యస్..యస్.. మా అబ్బాయే అనురాగ్" అన్నాను తేరుకుని.

"రియల్లీ యూ ఆర్ వెరీ లక్కీ పర్సన్, బికాజ్ యూ ఆర్ ఫాదరాఫ్ సచ్ ఎ స్టూడెంట్!" అభినందించాడు ప్రిన్సిపాల్.

రిపోర్ట్ కార్డు తీసుకునేటప్పుడు క్లాస్‌టీచర్ కూడా దాదాపుగా ప్రిన్సిపాల్ గారి మాటలే్న రిపీట్ చేసింది.

తిరిగి ఇంటికి వస్తున్నంతసేపూ ప్రిన్సిపాల్, టీచర్ల పొగడ్తలే నా చెవుల్లో మారుమోగుతున్నాయి.

ఇంట్లో అడుగు పెడుతుండగా "నీ హార్డ్‌వర్క్‌తో నువ్వింతగా రాణిస్తావని నేనూహించలేదు.. కాంగ్రాట్స్ రా" నా లోంచి పుత్రోత్సాహం ఉప్పొంగింది.

కానీ, వాడదేమీ పెద్దగా పట్టించుకోకుండా మౌనంగా వెళ్లి సోఫాలో కూర్చున్నాడు.

ముఖానికి ఏదో బుక్ అడ్డుగా పెట్టుకుని చదువుకుంటున్నాడు. సడెన్‌గా ఏదో గుర్తొచ్చినట్లు "రేపు ట్యూషన్‌ఫీజు పే చేయాలి డాడ్" అని గుర్తు చేశాడు.

"అలాగే.. రేపు ఉదయం గుర్తు చేయ్, ఇస్తాను. అలాగే మీ ట్యూటర్‌కి నీ రిపోర్ట్ కార్డు చూపించు"

"ఒకే డాడ్..!"

"అనూ! నువ్విలా ఫస్ట్ ర్యాంక్ సాధించావని తెలిస్తే మమ్మీ ఎంత హ్యాపీ ఫీలయ్యేదో!" అన్నాను నిశి గుర్తొచ్చి.

"అవును డాడ్!" అన్నాడు వాడు. అలా అంటుంటే వాడి గొంతులో బాధని స్పష్టంగా గుర్తించగలిగాను.

"మమ్మీ ఎక్కడుందో నీకు తెలుసా?" అడిగాను తెలివిగా వాడితోనైనా టచ్‌లో ఉందేమోనన్న ఆశతో.


"ఆ విషయం నేనే మిమ్మల్ని అడగాలి" అని, వెంటనే "అయినా మీరింకా మమ్మీని లవ్ చేస్తున్నారా డాడ్?" అని అడిగాడు.

సడెన్‌గా వాడలా అడిగేసరికి ఏం చెప్పాలో ఒక్క క్షణం అర్థంకాక అప్రయత్నంగానే "అవును" అన్నాను.

వెంటనే వాడు "మమ్మీ కూడా మిమ్మల్ని చాలా ప్రేమిస్తుంది డాడ్..."అన్నాడు ఉద్వేగంగా.

"అవునా? నీకెలా తెలుసు" అన్నాను ఆశ్చర్యంగా.

"ఎందుకంటే మమ్మీకి మిమ్మల్ని హేట్ చేయడం తెలియదు కనుక" అన్నాడు వాడు నిజాయితీగా.



వాడి మాటల్లో నిజాయితీ నా హృదయాన్ని తడిచేసింది. ఇంక నేనమీ మాట్లాడలేకపోయాను. వాడు మౌనంగానే ఉండిపోయాడు.

స్కూల్లో అనురాగ్ మంచి మార్కులు సాధిస్తూ, ఆటల్లో రాణిస్తూ అన్నింట్లోనూ హీరోగా గుర్తించబడుతున్నాడు. తండ్రిగా నేను గర్వపడుతున్నానేగానీ వాడి ఎదుగుదలను నేను చేసిందేమీ లేదు. నిజానికి వాడిని ఈ వయసులో ఎన్నో విషయాల్లో నేను క్లోజ్‌గా గైడ్ చేయాలి. తగిన విధంగా తర్ఫీదునివ్వాలి. కానీ నేనేమీ చేయలేకపోతున్నాను. తోడుగా నిశి లేని జీవితం ఆది, ఆద్యంతాలు ఏమీ అర్థం కావడం లేదు.

................

ఆఫీసులో నాకు ప్రమోషన్ వచ్చింది. ఎందరో నన్నభినందిస్తూ బోలెడు ఫోన్‌కాల్స్, మెసేజ్‌లతో విష్ చేస్తున్నారు.

సంతోషాన్ని షేర్ చేసుకోవానికి ఇప్పుడు నిశి లేదు. ప్రమోషన్ విషయం ఆమెకి తెలియదు. ఒకవేళ తనుంటే ఎంత హ్యాపీగా ఫీలయ్యేదోనన్న తలంపుతో గుండెల్లో దుఃఖం సుడులు తిరుగుతోంది.

నాలోకి నేను కుంచించుకుపోతూ నన్ను నేను ఓదార్చుకోవడం తప్ప మరెవ్వరితో షేర్ చేసుకోలేని దుస్థితి.

ఆరోజు నా జన్మదినం. ఎప్పటిలాగే ఎలాంటి మార్పు ఉండదనుకున్నాను. కానీ ఉదయం లేవగానే అనురాగ్ అందమైన ఫ్లవర్‌బొకేను అందిస్తూ "హ్యాపీ బర్త్‌డే" అంటూ విష్ చేసి నన్ను సర్‌ప్రైజ్‌కి గురి చేశాడు. అంతేకాదు, వాడు స్కూల్‌కి వెళ్తూ నా టేబిల్ మీద ఒక బర్త్‌డే కార్డు ఉంచి వెళ్లాడు. అందులో-


"మెనీ మోర్ హ్యాపీ రిటర్న్ ఆఫ్ ది డే, హ్యాపీ బర్త్ డే.. ఐ లవ్యూ డాడ్.. యువర్స్ లవింగ్ సన్.. అనురాగ్" అని.

నా పట్ల వాడికున్న ప్రేమ, గౌరవం నా హృదయాన్ని కదిలించింది.

అవును.. వాడెప్పుడూ తల్లిబిడ్డే. ఈ మధ్య వాడిలో ఏదో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. చాలా మ్యాచ్యూర్డ్‌గా బిహేవ్ చేస్తున్నాడు.

దేనికో వాడి గదిలోకెళ్లాను. తల్లికి సంబంధించిన వస్తువులన్నీ ఎంతో భద్రంగా దాచుకున్నాడు. మమ్మీ, డాడీలతో కలిసి తీయించుకున్న ఫొటో స్టడీ టేబుల్ మీద వాడికెదురుగా అమర్చుకున్నాడు. ఫొటోలో నేను, అనురాగ్, నిశిగంధ.. చాలా సంతోషంగా.

బహుశా.. మళ్లీ వాడి పసిమనసు ఆ రోజుల్ని గాఢంగా కోరుకుంటున్నాడన్న సత్యం నాకు బోధపడింది.




మనసంతా దిగులుమేఘం ఆవరించింది. ఎందుకో ఆరోజు ఆఫీసుకి వెళ్లాలనిపించలేదు. సెలవు పెట్టేశాను.

ఆ సాయంత్రం అనురాగ్ గుమ్మంలోంచే "హాయ్ డాడ్..!" అంటూ చేతిలో పెద్ద బర్త్‌డే కేక్‌తో హుషారుగా ఇంట్లోకి అడుగు పెట్టాడు.

అసలు అప్పటివరకు నేను బర్త్‌డే కేక్ గురించి ఆలోచించలేదు. అంతలోపే అనురాగ్ తీసుకొచ్చాడు.

అంతే... అమాంతం వాడిని కౌగిలించుకున్నాను.

"డాడ్.. ప్లీజ్ వన్ స్మాల్ రిక్వెస్ట్" అన్నాడు అనురాగ్.

"ఏంటీ?"

"ఈసారి మీ బర్త్‌డేకి మా ట్యూటర్‌ని మన గెస్ట్‌గా ఇన్వయిట్ చేద్దాం డాడ్.. ప్లీజ్" అన్నాడు అనురాగ్ అభ్యర్థిస్తున్నట్లుగా.

ఒకప్పుడు ఎవరూ నా ఇంటికి రావడం నాకిష్టముండేది కాదు. ముఖ్యంగా నా జన్మదినాన్ని పక్కన నా నిశి లేనందున ఒక్క నా బాబుతోనే గడపాలనుకున్నాను. కానీ వాడేమో వాడి ట్యూటర్ అంటున్నారు. వద్దంటే వాడు ఫీలవుతాడేమోననుకుని "ఒకే, నీ ఇష్టం.." అన్నాను.

అంతే.. వాడు బయటికెళ్లి క్షణాల్లో వాడి ట్యూటర్‌ని వెంటబెట్టుకొని లోపలికి వచ్చాడు.

ఆశ్చర్యం... ఒక్కసారి నా కళ్లను నేనే నమ్మలేకపోయాను.

"నిశీ.." అవును.. నా 'నిశిగంధ' మళ్లీ నా ఇంట్లో వాట్ ఎ సర్‌ప్రైజ్.. నమ్మశక్యంగా లేదు.

నేను ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే తను అన్నీ మర్చిపోయి హుందాగా ఇల్లంతా తిరుగుతూ "హు. ఇల్లంతా గందరగోళంగా ఉంది. అన్నీ నేనే సరిదిద్దాలి. అదిగో.. అక్కడున్న ఆ వెర్రిమనిషిని కూడా" అని నవ్వుతూ నా వంక చూపెడుతోంది అనురాగ్‌కి.

అనురాగ్, నేనూ, నిశి మనసారా నవ్వుకున్నాం. మళ్లీ ఇన్నాళ్లకు నిశి రాకతో ఈ ఇంట్లో ఇంత సంతోషం. మా ముగ్గురి కళ్లల్లోంచి ఆనందభాష్పాలు రాలిపడ్డాయి.

ఇన్నాళ్లూ అనురాగ్ వెనకాల ఎవరున్నారో.. వాడిలోని మార్పుకి కారణమెవరో నాకిప్పుడే అర్థమయింది. తను దూరంగా ఉన్నప్పటికీ ఒక ట్యూటర్‌గా అనురాగ్ వెనకాల నిలిచి వాడిని చక్కగా తీర్చిదిద్దింది నిశి. అన్నింట్లో వాడిని ముందుండేలా చూసింది. అంతేకాదు, తనే వాడితో నాకివాళ బర్త్‌డే కార్డ్ పంపించింది. డాడీని ప్రేమించాలని వాడిని నిరంతరం ప్రేరేపించింది కూడా తనే.

నిశి దగ్గరికెళ్లి "అయాం వెరీ సారీ నిశీ.. నన్ను మన్నించవా.. ప్లీజ్!" అన్నాను పశ్చాత్తాపంగా.

"హు.. మీరూ నన్ను క్షమించాలి. మనిద్దరం కలిసి అనవసరంగా అనురాగ్‌ని వేదనకు గురి చేసినందుకు మనం విచారించాలి" అంది నిశి ఏమాత్రం తడుముకోకుండా.

అవును.. ఆమె మాట్లాడుతున్న ప్రతి మాటలో సత్యం ఉంది. ఆమెలో ఒక ప్రత్యేకత ఉంది. రియల్లీ షీ ఈజ్ యూనిక్. ఇన్నాళ్లు అది తెలుసుకోలేక నా మూర్ఖత్వంతో తనని నేను దూరం చేసుకున్నాను.

ఏదేమైనా అర్థంలేని మా ఆవేశాలని, పంతాలని లెక్కచేయక, అనురాగ్ మా ఇద్దరి ప్రేమతో చక్కగా ఎదిగాడు. మళ్లీ మమ్మల్నిలా చూస్తూ అనురాగ్ గెలుపు సాధించినట్లు విజయదరహాసంతో వెలిగిపోతున్నాడు.

అవును.. అన్నింటినీ అధిగమించి, మమ్మీ-డాడీలను మళ్లీ కలపడమే అనురాగ్ అతిపెద్ద గెలుపు.

# తెలుగు సాహితీ దీప్తికి కారణజన్ముడు..సిపి బ్రౌన్

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్, 1798 నవంబరు 10న కలకత్తాలో జన్మించారు. తండ్రి మరణానంతరం కుటుంబం ఇంగ్లండ్‌కు తరలివెళ్లడంలో 1817లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా మద్రాస్ సివిల్ సర్వీస్ ఉద్యోగిగా నియామకం పొందారు. ఆ రోజులలో ఉద్యోగ నిర్వహణ కోసం బ్రిటిష్ దొరలు ప్రాంతీయ భాషలు నేర్చుకొనేవారు. అంతవరకు తెలుగుభాష పేరు కూడా వినని బ్రౌన్‌దొర, తదనంతర జీవిత కాలంలో తెలుగుభాషకు అపారమైన చిరస్మరణీయమైన సేవలు అందించి, నిష్కామ భాషాభిమానిగా తెలుగు సాహితీ దీపం వెలిగించారు. తెలుగుజాతి నిస్సందేహంగా బ్రౌన్‌దొరకు ఎంతగానో రుణపడి వుంది.




తెలుగు సాహిత్యం శిథిలమై కనుమరుగై పోతున్న కాలం అది. ఆ రోజులలోని పండిత ప్రకాండులు ఎవరూ తెలుగును గురించి పట్టించుకోని నిర్లక్ష్య దశ అది. 1824 నుంచి బ్రౌన్ దృష్టి, తెలుగు భాషా వికాసం, పునరుద్ధరణపై పడింది. ఆబే.జే.ఏ.దుబాయ్ ఆంగ్ల రచనలో, బ్రౌన్‌దొర వేమన ప్రస్తావన చదివాడు. అంతే.. మరుగునపడి కనుమరుగవుతున్న వేమన పద్యాల సేకరణ ఒక ఉద్యమంగా చేపట్టాడు. తెలుగునాట నలుమూలలా చేసిన గాలింపు సత్ఫలితాలను యిచ్చింది. అయిదు సంవత్సరాలు అహర్నిశలు శ్రమించి 1929 నాటికి వేమన పద్యాలకు ప్రాణప్రతిష్ఠగా, తన ఆంగ్లానువాదంతో 'ది వర్సెస్ ఆఫ్ వేమన' వెలుగు చూసింది. తరువాత రాజమహేంద్రవరం, తిరుచిరాపల్లి, చిత్తూరు, కడప మొదలైన ప్రాంతాలలో రెవెన్యూ, జ్యుడిషియల్ ఉన్నత పదవులు నిర్వహించారు. దైనందిన జీవితంలో తనకు తారసపడే పండితుడైనా, పామరుడైనా, బందీ అయినా, బంట్రోతయినా పెద్ద మనసుతో భాషాసేవకు ప్రాధాన్యత యిస్తూ వ్యవహరించారు. దానధర్మాలు చేసే ధర్మస్వరూపునిగాను, విద్యావ్యాప్తికి మచిలీపట్నం, మద్రాస్‌లలో ఉచిత పాఠశాలలో నెలకొల్పారు. తెలుగు భాషా సాహిత్యానికి కారణజన్మునిగా కీర్తి పొందారు.

ఆంగ్లేయ సాహితీ విధానం అనుసరిస్తూ, తెలుగు కావ్యాలను పరిష్కరించి ప్రకటించిన వారిలో బ్రౌన్ ఆద్యుడు. లిఖిత ప్రతులు ఎక్కడున్నా సేకరించి పండితుల సహాయంతో వ్యాఖ్యలు, పద సూచికలు తయారు చేయించారు. ఎన్నో ప్రాచీన కావ్యాలు వెలుగు చూసాయి. బ్రౌన్ ఆదరాభిమానాలు పొందిన పండితులలో వఠ్యం అద్వైత బ్రహ్మశాస్త్రి, జూలూరి అప్పయ్య పండితుడు, రావిపాటి గురుమూర్తిశాస్త్రి వంటివారు సహాయం అందించారు. కావ్యాలకు శుద్ధప్రతులు, పరిష్కారాలు, వ్యాఖ్యానాలు ప్రచురణలతో పాటు వేమనపద్యాలు, సుమతి శతకం ఆంగ్లానువాదాలు, బైబిలులోని లూకా సువార్త ఇలా ఎన్నో లఘు రచనలు వచ్చాయి.

బ్రౌన్‌దొరకు అజరామరమైన కీర్తి తెచ్చినవి, ఆయన రాసిన తెలుగు వ్యాకరణం, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు, మిశ్ర భాషా నిఘంటువు నేటికీ ప్రామాణికంగా ఉన్నాయి. తెలుగు సాహితీ క్షేత్రంలో ప్రతీ చదువరికి 'బ్రౌణ్యం' సుపరిచితం. బ్రౌన్ సేకరించిన జాబులు పదహారు సంపుటాలు నాటి తెలుగుదేశపు సాంఘిక చరిత్రకు అమూల్యమైన ఆనవాళ్లు. లిఖిత ప్రతుల్ని కేటలాగులుగా తయారు చేసారు. కాలగర్భంలో కలిసిపోతున్న ప్రాచీనాంధ్ర కావ్యాలు, బృహన్నిఘంటువులు, వ్యాకరణ శాస్త్రాలు, అనువాదాలు, పద్యశతకాలు తెలుగు సాహిత్య సీమలో నవ్యతా కాంతులు వికసింపచేసి తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవలందించారు.

బ్రౌన్ పండితుడు వ్యావహారిక భాషావాది అయినా వ్యాకరణంలో గ్రాంథిక, వ్యావహారిక రూపాలకు సమాన ప్రాధాన్యం యిచ్చారు. లక్ష్య లక్షణ సమన్వితుడైన బ్రౌన్ పండితుడు వైయాకరణునిగా కీర్తి పొందారు. బ్రౌణ్య తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు 1852లో వెలుగు చూసింది. ప్రాచీన కావ్యాలు, శతకాలు, ఛందోగ్రంథాలు, పల్నాటి వీర చరిత్ర వంటి రచనలలోని మాటలనే కాకుండా జీవద్భాష తెలుగుగా బ్రౌణ్య నిఘంటువులు తెలుగు భాషకు పెన్నిధులుగా వున్నాయి.

1824 నవంబరు 23న వేమన పద్యాల తన ఆంగ్లానువాద గ్రంథానికి బ్రౌన్‌దొర పీఠిక రాసారు. అప్పటివరకు ఏ తెలుగు కావ్యము అచ్చుకాకపోవడం, సాహిత్యపు విలువగల ఏ తెలుగు రచనా ఆంగ్లంలోకి అనువాదం కాలేదని తెలుస్తోంది.



రెండు వేల వేమన పద్యాలను సేకరించి, మచిలీపట్నం వాస్తవ్యుడైన తిప్పాభొట్ల వెంకట శివశాస్త్రి, వఠ్యం అద్వైత బ్రహ్మశాస్త్రి అర్థ వివరణ సహాయంతో, బ్రౌన్ తెలుగు సాహిత్యానికి మహోపకారం చేసారు. 1832 జులైలో సుమతీ శతక ఆంగ్లానువాదంగా 85 పద్యాలు, భాస్కర శతకం, విష్ణు పురాణం, సునందా పరిణయం నుంచి కొన్ని పద్యాలు అనువదించారు. అనంతపురం రాజుల యుద్ధాలు, మిరాసి వివాదం, తాతాచారి కథలు, 1852లో ప్రచురించబడిన తెలుగు వాచకం బ్రౌన్ తెలుగు సాహితీ సరస్వతికి ప్రసాదించిన మణిభూషణాలు.

1929 ఆంధ్ర వాఙ్మయ సూచిక పీఠికలో కాశీనాథుని నాగేశ్వరరావు, "బ్రౌన్ మహాశయులు నిష్కామ భాషాభిమానిగా ఆంధ్రులకు సర్వదా పూజాపాత్రులు" అని ప్రశంసించారు. తెలుగువారి తపఃఫలం అయిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్, 1884లో లండన్‌లో కన్ను మూసేనాటికి, అక్కడి విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా ఉన్నారు. మన మాతృభాషా వికాసానికి, జీవిత పర్యంతం శ్రమించి జీవద్భాష మహోన్నత వెన్నెల వెలుగులను ప్రపంచానికి చాటిచెప్పిన బ్రౌన్ మహాశయునికి మనం తల వంచి ప్రణతులు సమర్పించవలసినదే.

**- జయసూర్య**

# మోసగించాలనుకుంటే మనమే మోసపోతాం..

ఒక ఊళ్లో ఓ ప్రసిద్ధ పాత్రికేయుడు ఉండేవాడు. ఆయన ఓ రోజు ఆకస్మికంగా మరణించాడు. అనంతరం ఆయన తిన్నగా స్వర్గానికి పోయాడు.

స్వర్గ వాకిట్లో నిల్చున్న ద్వారపాలకుడు ఆయనను అడ్డుకున్నాడు.

"ఇదిగో చూడు, ఇప్పటికే ఇక్కడ పన్నెండు మంది పాత్రికేయులు ఉన్నారు. వారికే ఇక్కడ పని లేదు. దానికి కారణమేమిటంటే స్వర్గంలో సంచలమైన సంఘటనలంటూ ఏముంటాయి రాయడానికి. ఇక్కడ అన్నీ సక్రమంగా జరుగుతుంటాయి. పత్రికలకు కావలసిన సంచలన సంఘటనలు వగైరా.. వగైరా ఇక్కడ ఏమీ ఉండవు ప్రచురించడానికి. దారిదోపిడీలు, హత్యలు, మానభంగాలు, తప్పుడు పనులు వంటివేవీ ఉండవు. ఇప్పటికే ఇక్కడికి వచ్చిన పాత్రికేయులందరూ చెట్టు కింద కూర్చుని ధ్యానం చేస్తున్నారు. ఏమీ తోచక కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. వారు రాయడానికి ఏమీ ఉండదు. ఇక్కడున్న పత్రికలో వార్తలంటూ ఏమీ ఉండవు, ధ్యానం గురించి తప్ప. అందులో ఆసక్తి ఏముంటుంది? అది చదవడానికి ఇక్కడ ఒక్క మనిషీ లేదు. కనుక నేనేం చెప్తున్నానంటే నువ్వు నరకానికి వెళ్లిపో. అక్కడైతే ఎన్నో.. ఎన్నెన్నో సంఘటనలు జరుగుతుంటాయి. ఈరోజు, ఆరోజు అంటూ ఏమీ తేడా లేదు. ఎప్పుడు పడితే అప్పుడే అన్ని రకాల చెడు కార్యాలు జరుగుతుంటాయి. కనుక అక్కడే పాత్రికేయుల అవసరం ఎక్కువగా ఉంది, ఉంటుంది. నీకక్కడ బోలెడంత పనుంటుంది. నా మాట విని అక్కడికి వెళ్లు. నీకు అక్కడ టైమే సరిపోదు. అంత రాత పనుంటుంది. నీలాంటి పాత్రికేయులకు కావలసింది రాయడమేగా! లేకుంటే ఏమీ తోచదుగా. నీకు ఆనందంగా, తృప్తిగా ఉంటుంది" అన్నాడు ద్వారపాలకుడు.




పాత్రికేయుడు అతను చెప్పిందంతా విని ఆలోచనలో పడ్డాడు. కానీ అతనికి నరకానికన్నా స్వర్గంలోనే ఉండాలని ఆశ. కనుక అతను ద్వారపాలకుడితో నెమ్మదిగా "అయ్యా! కనీసం ఇరవై నాలుగు గంటలైనా నేను ఇక్కడ ఉండేందుకు అవకాశం ఇవ్వండి" అని ప్రాధేయపడ్డాడు.

మళ్లీ ఆ పాత్రికేయుడు తన మాటలు కొనసాగిస్తూ "ఇక్కడున్న పాత్రికేయులు నాకు తెలిసినవారై ఉంటారు. వారితో మాట్లాడి ఒప్పించి వారిలో కొందరినైనా నరకానికి పంపుతాను. నేను ఇక్కడ ఉండిపోతాను. అందుకు నువ్వు కాస్త సహకరించు" అని అడిగాడు.

"మీ లెక్క ప్రకారం పన్నెండు మందికి మించి ఇక్కడ ఉండకుండా చూడటం నా పని" అన్నాడు, ఆ పాత్రికేయుడు.

అందుకు ద్వారపాలకుడు "సరేనని" ఒప్పుకున్నాడు. కానీ ఒక్క విషయం.. నీకు ఇచ్చేది ఇరవై నాలుగ్గంటల సమయమే. ఈలోపు నువ్వు కొందరినైనా నరకానికి పంపాలి. ఇక్కడి పాత్రికేయుల సంఖ్య పన్నెండు దాటకూడదు. సరేనా. అలాగానీ జరగలేదంటే నేను నిన్ను బలవంతంగా నరకానికి పంపేస్తాను" అని హెచ్చరించాడు.

"అలాగే" అని పాత్రికేయుడు ద్వారపాలకుడికి ధన్యవాదాలు చెప్పి లోపలకు వెళ్లాడు.

లోపలికి వెళ్లి బాగా ఆలోచించాడు.. ఉన్నట్టుండి ఓ పుకారు పుట్టించాడు. సాటి పాత్రికేయులను పిలిచి వారిలో "ఇదిగో చూడండి.. నరకంలో భారీ స్థాయిలో ఓ పత్రిక తీసుకురావడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందుకు అనేకమంది పాత్రికేయులు కావాలట. జీతం కూడా బాగానే ఇస్తారు. కనుక ఎవరెవరు నరకానికి వెళ్లదలచుకున్నారో వారందరూ వెంటనే నరకానికి వెళ్లిపోవచ్చు" అన్నాడు.

అంతే! వెంటనే ఆ పన్నెండు మంది పాత్రికేయులు నరకానికి వెళ్లిపోయారు.

ఇరవై నాలుగ్గంటల తర్వాత ఆ పాత్రికేయుడు ద్వారపాలకుడితో "ఇక్కడ ఒక్క పాత్రికేయ మిత్రుడూ కనిపించడం లేదేంటి?" అని అడిగాడు.

అప్పుడు ఆ ద్వారపాలకుడు "నువ్వు ఏం చెప్పావోగానీ మునుపున్న పన్నెండు మందీ నరకానికి వెళ్లిపోయారు. కనుక నువ్వు స్వర్గం విడిచిపెట్టి వెళ్లడానికి వీల్లేదు. నువ్వు ఇక్కడే ఉండాలి" అన్నాడు.

పువ్వు పుట్టించిన పుకారుతో ఆ పన్నెండు మంది పాత్రికేయులు పోటీ పడి నరకానికి వెళ్లిపోవడం తలచుకుంటే ఆశ్చర్యమేస్తోంది. నువ్వు గట్టివాడివే" అన్నాడు.

ద్వారపాలకుడి మాటలకు పాత్రికేయుడు విస్తుపోయి "ఏమిటీ? పన్నెండు మందీ వెళ్లిపోయారా?"

"నరకంలో నిజంగానే ఓ పత్రిక రాబోతోందా?" అని ఆలోచించాడు ఆ పాత్రికేయుడు. "నేను ఉత్తినే చెప్పాను.. కానీ అది నిజమేనా?" అనుకున్నాడు.

"అయ్యా, నన్ను విడిచిపెట్టండి. నేను నరకానికి వెళ్లి చూస్తాను.

(మిగతా 27వ పేజీలో..)



# ఏకశిలా నగరం మహాబలిపురం

**ప్రాచీన శిల్పకళా వైభవంతో విరాజిల్లుతున్న పర్యాటక కేంద్రాలలో ఒకటి మహాబలిపురం. తమిళనాడు రాజధాని నగరమైన చెన్నైకి 70 కి.మీ. దూరంలో, కంచి పట్టణానికి 66 కి.మీ. దూరంలో బంగాళాఖాతం సముద్రం తీరంలో చెంగల్పట్టు జిల్లాలోని ఒక పట్టణం మహాబలిపురం. ఒకప్పుడు దీనిని మామల్లపురం అని పిలిచేవారు. మహాబలి అనే రాజు పరిపాలించిన ప్రదేశం కావడం వల్ల మహాబలిపురం అనే పేరు వచ్చిందని ఇక్కడి ప్రజలు, స్థానికులు చెబుతూ ఉంటారు.**

షేక్ అబ్దుల్ వాహీం జాని

ఒకవైపున చరిత్ర మరో వైపున ఆధ్యాత్మికత పెనువేసుకుపోయి కనిపించే ప్రదేశమే మహాబలిపురం. ఈ ప్రదేశం పురాతన పేరు తిరుకడల్మలై. పల్లవ రాజ్యంలో రెండు ప్రధాన ఓడరేవు నగరాల్లో మామల్లపురం ఒకటి. అది కాలక్రమంలో ప్రసిద్ధి చెంది మామళ్లపురంగా రూపాంతరం చెందింది. ఈ పట్టణానికి పల్లవ రాజు మొదటి నరసింహవర్మ పేరు పెట్టారు. ఇతన్ని మామల్ల అని కూడా పిలుస్తారు. పల్లవ రాజులందరిలోకి మొదటి నరసింహవర్మ అగ్రగణ్యుడు. ఆయన ఇక్కడ ఎన్నో అద్భుతమైన కట్టడాలను నిర్మించారు. కాబట్టి ఆయన పేరు మీదగా ఈ ప్రాంతాన్ని మామల్లపురం అని పిలుస్తూ ఉండేవారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని మహాబలిపురంగా పిలుస్తున్నారు. ఇతని పాలనా కాలంలోనే చైనా యాత్రికుడు హ్యుయాన్‌త్సాంగ్ కంచిని సందర్శించాడు. ఇక్కడి ప్రకృతి అందాల మధ్య సందర్శించడం అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. ఇంకా చెప్పాలంటే పల్లవ రాజులలో ప్రముఖుడిగా పేర్కొన్న మొదటి నరసింహవర్మకు మహామల్ల, బాహుబలి, పల్లవమల్ల అనే బిరుదులు కూడా ఉండేవి. క్రీ.శ.642లో జరిగిన యుద్ధంలో చాళుక్యరాజు రెండవ పులకేశిని ఓడించడం వలన నరసింహవర్మకి ఈ బిరుదు వచ్చిందని చరిత్ర చెబుతోంది. చాళుక్య రాజుల రాజధానిని మొదటి నరసింహ వర్మ ధ్వంసం చేసి వాతాపికొండ అనే బిరుదు పొందాడు.



## అద్భుతమైన ఏక శిలా నిర్మాణాలు

ఏక శిలా నిర్మాణాలు, గుహాలయాలు ఇక్కడి ప్రత్యేకతలు. అందువల్లనే దీన్ని 'ఏకశిలా నగరం' అని పిలుస్తారు. మహాబలిపురాన్ని ఒకప్పుడు ఏలిన పల్లవరాజులు ఇక్కడ అనేక నిర్మాణాలను గావించారు. పల్లవుల కాలంలో ఇది పోర్ట్ సిటీగా విరాజిల్లింది. ద్రవిడ శిల్పశైలిలో ఇక్కడి రాతి కళాఖండాలను రూపొందించారు. ఈ పట్టణంలో ఉన్న తీరం వెంబడి ఉన్న దేవాలయం యునెస్కో వారిచే ప్రపంచ సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇది మహాబలిపురంలోని 7వ, 8వ శతాబ్దాలకు చెందినవి.

భారతదేశంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలలో ఇది ఒకటి. ఆర్థిక శ్రేయస్సుతో పాటు, ఇది రాచరిక స్మారక కట్టడాల సమూహంగా మారింది. ఇక్కడ శిల్పాలను సజీవ శిల్పాలుగా చెక్కారు. ఇది 7వ, 8వ శతాబ్దాల నాటి రథాల రూపంలోని ఆలయాలు, మండపాలు, శివునికి అంకితం చేసిన తీర దేవాలయం ఇక్కడ ప్రధాన ఆకర్షణ.

పల్లవుల పరిపాలనా కాలంలోనూ ఈ ప్రాంతం స్వర్ణయుగాన్ని చూసింది. పల్లవులు ఈ ప్రాంతాన్ని రాజధానిగా చేసుకొని కొంతకాలం పాలించారు. అప్పుడు కట్టించినవే ఈ శిల్పకళా సంపద.

పల్లవులు దీనిని చక్కటి రేవుపట్నంగా తీర్చిదిద్దారు. దాని కోసం ఇక్కడ కొండమీద ఒక లైట్ హౌస్‌ని కట్టారు. సమకాలీన పట్టణ ప్రణాళికను 1827లో బ్రిటిష్ రాజు స్థాపించాడు.

మహాబలిపురంలో చూడదగిన పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. మహబలిపురం బీచ్, టైగర్ గుహలు, తీర దేవాలయం, ఐదు రథాలు, అర్జునుడి తపస్సు, కోవ్‌లాంగ్ బీచ్ ఇండియన్ సీషెల్ మ్యూజియం, కృష్ణగుహ దేవాలయం, మహిషాసుర మర్దిని గుహ, గణేష్ రథ దేవాలయం, వరాహ గుహ దేవాలయం మొదలైనవి.

ఇక్కడి ఆలయాలు, శిల్పాలు, అపూర్వ చరిత్రతో పాటు అందమైన సహజ సౌందర్యాన్ని చాటుతున్నాయి. గుహలలో, ఏకశిలా రథాలపై, దేవశాలపై చెక్కబడిన శిల్పాలు జీవం ఉట్టిపడేలా కనిపిస్తాయి. పల్లవులు హిందూ మతంతో పాటు జైన, బౌద్ధ మతాలను ఆదరించి, అనుసరించి మత సామరస్యాన్ని చాటారని చైనా యాంత్రికుడు హ్యుయాన్‌త్సాంగ్ తన రచనలలో పేర్కొన్నారు.

మహేంద్రవర్మ శైవమతానికి మారిన తరువాత ఇక్కడి శిల్పకళలో అనేక మార్పులు జరిగాయి. పల్లవులు కాంచీపురాన్ని ప్రధాన కేంద్రంగా





చేసుకుని పాలించినప్పటికీ మహాబలిపురాన్ని శిల్పసాగరంగా తీర్చిదిద్దారు. అయితే మహాబలిపురాన్ని ముగ్గురు రాజులు అభివృద్ధి చేసినట్లు చరిత్ర చెబుతోంది. 600 నుండి 630 మధ్య కాలంలో పాలించిన ఒకటవ మహేంద్రవర్మ; 630 నుండి 668 వరకు పాలించిన మొదటి నరసింహవర్మ; ఇతని వారసుడు 700 నుండి 728 మధ్య పరిపాలించిన రాజసింహ వర్మన్ మొదలైన రాజులు ఇక్కడ శిల్పకళను అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. వీరిలో మొదటి నరసింహ వర్మ అగ్రగణ్యుడిగా ఖ్యాతినార్జించారు. అప్పట్లో అక్కడో శిల్ప కళాశాల కూడా ఉండేదని ప్రతీతి. కొండలను తొలచి ఇక్కడి నిర్మాణాలు గావించారు. మహాబలిపురంలో చూడవలసిన శిల్ప విశేషాలు చాలా ఉన్నాయి. ఇది ద్రవిడ శిల్పకళా నైపుణ్యానికి మచ్చుతునకలు.

## సాగర తీరాన శిల్పకళా భాండాగారం

ఇక్కడ బంగాళాఖాత సముద్ర తీరాన గల దేవాలయం మహాద్భుతంగా ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సాగర తీరంలో శిల్పకళా భాండాగారంగా విరాజిల్లుతుంది. సముద్ర తీరంలో శివ, విష్ణు ఆలయాలున్నాయి. 8వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయాల నిర్మాణ శిల్పకళా చాతుర్యం బహు ప్రశంసనీయమైనది. ఎనిమిదవ శతాబ్దంలో నిర్మితమైన ఈ ఆలయం దక్షిణ భారతదేశంలోని ప్రాచీన మందిరాలలో ఒకటి. దీన్ని విష్ణువు, శివునికి అంకితం చేసారు.

ఈ ఆలయ శిల్పకళా చాతుర్యం బహు ప్రశంసనీయం. దేవాలయ వెనుక భాగంలో గోడలపై స్కంధ, సోమ శిల్పాలను తిలకించవచ్చు. శ్రీకృష్ణ మంటపంలోలని మహాభారత విశేషాలు చూడదగినవి. గోవర్ధనగిరిని చిటికెన వేలితో ఎత్తిన శ్రీకృష్ణుడు, పక్కనే పశువులు మేతమేయడం, గోపికలు పాలు, పెరుగు కడవలను నెత్తిన పెట్టుకొని వెళ్లడం, శ్రీకృష్ణుడు వేణుగానాన్ని వినిపించడం మొదలైన అనేక శిల్పకళా దృశ్యాలు జీవం ఉట్టిపడే విధంగా శ్రీకృష్ణ మంటపంలో కనిపిస్తాయి. రాత్రిపూట విద్యుత్ దీపాల వెలుగులో ఈ ఆలయాల సౌందర్యం వర్ణనాతీతం. మరో మహత్తర శిల్పకళా ఖండం గంగానది పుట్టుక. భగీరథుడు తపస్సు చేసే సన్నివేశం, దివి నుండి గంగమ్మ భువికి ఏతెంచడం మొదలైన అనేక శిల్పాలు మహాబలిపురంలో కనిపిస్తాయి. పాండవ మధ్యముడైన అర్జునుడు శక్తివంతమైన ఆయుధాల కోసం శివుడ్ని ప్రార్థించడం వంటి దృశ్యాలు ఇక్కడ కనిపిస్తాయి. ఈ శిల్ప కళాఖండాన్ని రెండు విభాగాలుగా శిల్పీకరించారు. మహాభారతంలోని కొన్ని సంఘటనలు ఇక్కడ ఒక బ్రహ్మాండమైన రాతిపై చెక్కారు. ఈ రాయి తిమింగలం ఆకారంలో ఉంటుంది. ఈ కుడ్యంపై ఉన్న శిల్పకళ వర్ణనాతీతంగా ఉంటుంది. మొదటి విభాగంలో యక్షులు, గంధర్వులు, సూర్యచంద్రులు, సంగీత, సాహిత్యాలు, విద్యాధరులు ఇత్యాదివి శిల్పీకరించారు. రెండవ విభాగంలో క్రూరమృగాలు, చెట్లు, గిరిజనులు, జింకలు, కుందేళ్లు, ఏనుగులు, పులులు శిల్పీకరించారు. శివుడికోసం అర్జునుడు తపస్సు చేయగా ఈశ్వరుడు ప్రత్యక్షమై అర్జునునికి వరమిచ్చే దృశ్యం కళ్లకు కట్టినట్లు శిల్పీకరించారు. ఈ శిల్ప దృశ్యాన్ని తిలకించిన పల్లవ రాజుల సమకాలికుడైన భారవి 'కిరాతార్జునీయం' రచించినట్లు చరిత్ర చెబుతోంది.

## పంచపాండవుల రథాలు

మహాబలిపురంలో మరో ప్రత్యేక నిర్మాణం పంచరథాలు. ఏకశిలలో శిల్పీకరించిన వీటినే పంచపాండవుల రథాలు అని కూడా పిలుస్తారు.

వీటిని పంచపాండవులైన ధర్మరాజు, భీముడు, పాండవ మధ్యముడైన అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఇత్యాది పేర్లతో పిలుస్తారు. వీటిలో ధర్మరాజు రథం పెద్దగా ఉంటుంది. పంచపాండవ రథాలను శివుడు, విష్ణువు, దుర్గ, ఇంద్రులకు అంకితమిచ్చినట్లు తెలుస్తోంది. ఇక్కడ వున్న రథాలు ఎంతో ఎత్తైనవి. ఈ రాతి రథాలు ఎంతో అందంగా వుంటాయి. ఇవన్నీ సముద్రాన్ని చూస్తుంటాయి. ఈ ఐదు రథాలను ఆగమ పద్ధతులలో నిర్మించారు. వాటిని పంచ పాండవుల రథాలు అంటారు. ఇందులో నాలుగు రథాలు ఏకశిలా నిర్మితాలు.

ఇక్కడ ఎనిమిది దేవాలయాలు ఉన్నప్పటికీ ప్రజలు అయిదు దేవాలయాలనే సందర్శిస్తారు. ఆ దేవాలయాల్లో ఒకటి రెండు అంతస్తులను కలిగి వుంది. మొదటి అంతస్తులో ఇరవై రెండు శిల్పాలు ఉంటాయి. నటరాజస్వామి విగ్రహం, శ్రీకృష్ణుడు కాళీయమర్దనం, హరిహర విగ్రహాలు ప్రముఖమైనవి.

ఇక్కడి రాతిగుహలలో హిందూ పురాణాలలోని సంఘటనలన్నీ చిత్రీకరించి ఉంటాయి. మహిషాసురమర్దిని విగ్రహం, ఆదమరచి నిద్రపోతున్న మహావిష్ణువు విగ్రహం,



దున్నపోతు తలను కలిగిన రాక్షసులతో యుద్ధం చేస్తున్న దుర్గమ్మ ఇంకా అనేక చిత్రాలు రాతి గుహలలో తిలకించవచ్చు. మంటపాలలో మహిషాసుర మంటపం ఉంది. మహిషాసురుడిని, శక్తి దేవతయైన దుర్గామాత పోరాటాన్ని శిల్పీకరించారు. గోవర్ధన మంటపం, పాశు మంటపం చూడదగినవి.

మహాబలిపురంలో ఉన్న గుహలలో కృష్ణగుహ ఎంతో ప్రసిద్ధి చెందింది. తరువాత మహిషాసుర మర్దిని గుహ, దీని తరువాత మహావిష్ణువు యోగనిద్ర పోతున్న గుహ ఎంతో ప్రసిద్ధి చెందింది. అందులో.. దుర్గాదేవి, మహిష తల వున్న రాక్షసునితో యుద్ధం చేస్తున్నట్లు ఉంటుంది. ఈ గుడి 8వ శతాబ్దం నాటిది. ఇది ద్రావిడ పద్ధతిలో నిర్మించిన గుడి. ఇది తూర్పు, పశ్చిమాలు చూస్తూ వుంటుంది. వీటితో పాటు జమైక రథం, వరాహ గుహ ప్రాచీనంగా వున్నాయి.

ఏకశిలలో శిల్పీకరించిన ఏనుగు శిల్పం అతిసహజంగా ఉంటుంది. మామల్లపురం శిల్పకళకు ప్రసిద్ధి చెందినది. ఇక్కడి శిల్పశాలలో తయారయ్యే శిల్పాలు ప్రతిరోజూ దేశ, విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. నాటి శిల్పకారుల ప్రతిభాపాటవాలకు మహాబలిపురం మచ్చుతునక. ఇప్పుడు అనునిత్యం దేశ, విదేశాల నుండి పర్యాటకులు ఈ శిల్పకళాఖండాలను తిలకించటానికి మహాబలిపురానికి వస్తున్నారు.

---

**(24వ పేజీ తరువాయి..)**

## మోసగించాలనుకుంటే..

బహుశా అక్కడ విశేషాలు ఏమైనా ఉన్నాయేమో చూడాలని ఉంది.పన్నెండు మంది వెళ్లిపోవడం విచిత్రంగా ఉంది. కనుక నన్ను అడ్డుపెట్టకండి. ఒక్కసారి వెళ్లి చూసొస్తాను" అని ప్రాధేయపడ్డాడు పాత్రికేయుడు ద్వారపాలకుడిని.

ఇతరులు నమ్మాలని తాను ఒక పుకారు పుట్టించాడు. కానీ చివరకు ఆ పుకారుకి తానే లోనయ్యాడు. ఎలాగంటే ఇతరులను మోసగిద్దామనుకున్న ఆ మనిషి మనసు ఇప్పుడు ఆ పుకారునే నమ్ముతోంది.

అందుకే అంటారు అనుభవజ్ఞులు "ఇతరులను మోసం చేయాలనుకుంటే మీరే ఎప్పుడో ఒకప్పుడు.. ఎక్కడో ఓ దగ్గర మోసపోతారని".

అందుకే "మనసు దగ్గర ఎంతో హెచ్చరికతో ఉండాలి" అంటారు ఓషో.

కొందరు ఉన్నట్టుండి పుకార్లు పుట్టిస్తుంటారు "ఫలానా చోట పిశాచాలు, దెయ్యాలు ఉన్నాయని".

ఒక వ్యక్తి చీకటి వేళ.. అడవి మార్గంలో పోతున్నాడు. అక్కడ పిశాచాలు, దెయ్యాలు ఉన్నాయని వదంతులు వచ్చాయి. దాంతో అతనికి భయమేసింది, అడుగులు వేగంగా వేశాడు.

అమ్మయ్య! ఓ బస్సు నిలబడి ఉంది అక్కడ. చీకట్లో కనిపిస్తోంది ఆ బస్సు. పరుగున వెళ్లి దాన్నందుకోవాలి అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా అతను పరుగున వెళ్లి బస్సెక్కాడు, కూర్చున్నాడు. ఆ తర్వాతే తెలిసింది.. లోపల ఎవరూ లేరు, డ్రైవరూ లేడు, కండక్టరూ లేడు.

అతనికి భయం వేసింది. ఇంతలో బస్సు తానుగా కదులుతోంది. డ్రైవర్ సీట్లో ఎవరూ లేరు. దాంతో అతనికి భయం వేసింది, చెమటలు పట్టాయి.

పెద్దగా అరవాలనుకున్నాడు. సరిగ్గా ఆ సమయంలోనే అతని భుజం మీద ఎవరో చేయి వేసారు. వెనక్కు తిరిగి చూసాడు.

అక్కడ డ్రైవర్ నిల్చున్నాడు.

ఆయన చెప్పాడు "ఓయ్! ఈ బస్సు బ్రేక్ డౌన్‌తో ఆగిపోయింది. మేమంతా దిగి వెనక నిల్చుని బస్సుని తోస్తున్నాం. నువ్వు మాత్రం దర్జాగా కూర్చున్నావేంటి? దిగి కిందకు. రావయ్యా, అందరం కలిసి బస్సుని తోద్దాం" అన్నాడు.

**- యామిజాల జగదీశ్**

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.
మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి యథాతథంగా ఉంటుంది. వారాంతంలో వృథా ఖర్చులుంటాయి. ప్రయత్నాలు ఫలిస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది.



## వృషభం

కుటుంబ సమస్యలు వారాంతంలో పరిష్కారం అవుతాయి. వృత్తి వ్యాపారస్తులకు రుణాలు లభిస్తాయి. అకారణంగా మనోవేదనకు లోనవుతారు. ఆర్థిక ఇబ్బందులను అధికమిస్తారు. బంధు, మిత్రులను కలుసుకుంటారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగులకు శుభ యోగం. రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

## మిథునం



ఉద్యోగులకు పై అధికారుల పని వత్తిడి ఉంటుంది. సంతానాభివృద్ధి గురించి ఆలోచిస్తారు. ఆర్థికంగా ఆశాజనకంగా ఉంటుంది. విద్యార్థులకు శుభ యోగం. శుభ కార్యాల్లో పాల్గొంటారు. వ్యాపారులకు రుణాలు లభిస్తాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు.



## కర్కాటం

అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. ఆరోగ్య, ఆహార సలహాలు-సూచనలు పాటించండి. క్రయ-విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. శుభ కార్యాలకు అధిక ధనం ఖర్చు చేస్తారు.

## సింహం



భోజన సౌఖ్యం. ఆరోగ్యం బాగుంటుంది. వారాంతంలో వృథా ఖర్చులుంటాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. మానసిక అలసటకు లోనవుతారు. వృత్తి రంగాల్లో వున్నవారికి ఖర్చులు అధికంగా ఉంటాయి. బంధు, మిత్రులను కలుసుకుంటారు. నిరుద్యోగులకు ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. శత్రువులపై విజయం సాధిస్తారు.



## కన్య

ఉద్యోగంలో ప్రతికూలతలుంటాయి. క్రయ-విక్రయాలు లాభదాయకం. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. వారాంతంలో వ్యాపారులకు స్వల్ప నష్ట సూచనలున్నాయి. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. సంతానాభివృద్ధి గురించి చేసే ఆలోచనలు ఫలిస్తాయి. రుణాలు లభిస్తాయి. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు.

## తుల



ఖర్చులు అధికంగా ఉంటాయి. అనుకున్నది సాధించలేకపోవచ్చు. మానసిక సంఘర్షణకు లోనవుతారు. వారాంతంలో ఆర్థికంగా బాగుంటుంది. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. కళాకారులకు సన్మాన యోగం. ఉద్యోగులకు పదోన్నతి/స్థానచలన సూచనలున్నాయి. ఆత్మీయుల నుండి శుభ వార్తలు వింటారు.



## వృశ్చికం

వృత్తి రంగాల్లో వున్నవారికి ఆర్థిక లాభాలుంటాయి. సంయమనంతో వ్యవహరించడం చెప్పదగిన సూచన. సామాజిక న్యాయం కోసం కృషి చేస్తారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. ప్రముఖులను కలుసుకుంటారు. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. వాహన యోగం. దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించే సూచనలు అధికంగా ఉన్నాయి. ఆరోగ్య సలహాలు పాటించండి.

## ధనుస్సు



క్రయ-విక్రయాలు లాభదాయకం. ఉద్యోగులకు ప్రశంసలు లభిస్తాయి. ఆర్థికాభివృద్ధి ఆశించిన స్థాయిలో ఉంటుంది. వారాంతంలో రుణాలు తీరుస్తారు. వ్యతిరేకతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. ఆలోచనలు అస్థిరంగా ఉంటాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది.



## మకరం

వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. రుణాలు తీరుస్తారు. బంధు, మిత్రులతో మాట్లాడేటప్పుడు సంయమనంతో వ్యవహరించండి. ఉద్యోగులకు ప్రశంసలు లభిస్తాయి. యాత్రలు చేస్తారు. సహనం అలవరచుకోవడం అత్యవసరం. ఆరోగ్య సమస్యలను అధికమిస్తారు. ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులేమీ ఉండవు. పాత బాకీలు తీరుస్తారు. శత్రుబాధలు తీరుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు.

## కుంభం



మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. ఆర్థిక ఇబ్బందులను అధికమిస్తారు. వృథా సంచారం చేస్తారు. సమయం సద్వినియోగం చేసుకోవడం చెప్పదగిన సూచన. ఉద్యోగులకు ప్రోత్సాహం లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు సానుకూలం. వృత్తి వ్యాపారులకు యథాతథం. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. బంధువులతో మనస్పర్థలు.



## మీనం

తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థికాభివృద్ధి సంతృప్తినిస్తుంది. వ్యతిరేకతలు ఎదురైనా పనులు పూర్తి చేస్తారు. రుణాలు తీర్చి ఊరట పొందుతారు. ఉద్యోగులకు ప్రశంసలు లభిస్తాయి. ధార్మిక చింతన అలవడుతుంది. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆశాజనకంగా ఉంటుంది. దుష్ట సాంగత్యం మంచిది కాదని తెలుసుకుంటారు.

# ఉత్తమ గురు శిష్యులు

**తల్లిదండ్రుల్లో సమానంగా గురువును గౌరవించి ఆదరిస్తాం. మన పురాణాలు, రామాయణం, మహాభారతాల్లో కూడా గురువుల ప్రస్తావన, వారి గొప్పతనం వర్ణించబడింది.**

**"గురువు లేక ఎటువంటి....." అన్నాడు త్యాగరాజస్వామి.**

అందరికీ అంతగా సుపరిచతుడు కానీ ఋషిధౌమ్యుడు, ఆయన ముగ్గురు శిష్యుల్ని గురించి తెలుసుకుందాం.

అందులో ఒక శిష్యుడి పేరు ఆరుణి. ఒకసారి గురువు పొలానికి గండి పడింది అంటే రంధ్రం ఏర్పడి నీళ్ల వేగంగా ప్రవహించసాగాయి. గురువు ఆజ్ఞతో పొలానికి వెళ్లిన ఆరుణికి ఆ ప్రవాహాన్ని ఎలా ఆపాలో తెలియక ఆ పొలం రంధ్రం దగ్గర అడ్డుగా పడుకున్నాడు. నీటి ప్రవాహం ఉధృతి తగ్గింది. గురువుకి ఆరుణి కన్పించకపోవటంతో ఆరా తీశాడు.

"గురూజీ! మీరే కదా పొలానికి పంపారు?" అని మిగతావారు అనేటప్పటికి ఉత్తముడైన ధౌమ్యుడు అతన్ని వెతుక్కుంటూ వెళ్లి "నాయనా! ఎక్కడున్నావు?" అని ఎలుగెత్తి పిలిచాడు.

"స్వామీ! మీ ఆజ్ఞ ప్రకారం పొలంలో నీటి ప్రవాహం ఆపటం కోసం అడ్డంగా పడుకున్నాను" అని జవాబిస్తాడు.

గురువు ఆనందంతో "నాయనా! నీవు పొలంగట్టుని ఉద్ధలించుకుని(పెకలించి) వచ్చావు కనుక ఉద్దాలకుడు అని పిల్వబడ్తావు" అని ఆశీర్వదించాడు.

ధౌమ్యుని రెండో శిష్యుడు ఉపమన్యుడు. ఇతనికి మహా గురుభక్తి. తు.చ. తప్పకుండా ఆయన ఆజ్ఞను శిరసావహించేవాడు. ఇతనికి ఎలాంటి పరీక్ష పెట్టాడో చూడండి.. "ఉపమన్యా! నీవు తెచ్చే భిక్ష మొత్తం నాకే సమర్పించాలి. అందులోంచి ఏమీ తీసుకోకూడదు".

"అలాగే" అన్నాడు శిష్యుడు.

కానీ రెండోసారి తన కోసం భిక్షకు వెళ్తున్నానని చెప్పగానే "అలా కుదరదు" అన్నాడు గురువు.

> 'గురూజీ! మీరే కదా పొలానికి పంపారని" మిగతా శిష్యులు అనేటప్పటికి ఉత్తముడైన ధౌమ్యుడు అతన్ని వెతుక్కుంటూ వెళ్లి "నాయనా! ఎక్కడున్నావు?" అని ఎలుగెత్తి పిలిచాడు.

అయితే రోజూ చురుగ్గా ఆవుల్ని మేపి ఇంటికి చేరే ఉపమన్యుడు ఇంత చురుగ్గా తిండి లేకుండా పనుల్ని ఎలా ఆచరిస్తున్నాడో! అన్న అనుమానం కలిగింది. లేగదూడలు పాలు తాగేటప్పుడు ఎగిసే నురుగును స్వీకరిస్తున్నాడని తెలిసి "అలా చేయవద్దు" అని మళ్లీ ఆజ్ఞాపించాడు.

ఇక చేసేదేమీ లేక శిష్యుడు జిల్లేడు ఆకులు తిన్నాడు. దాంతో కంటిచూపు



పోయింది (జిల్లేడురసం కంట్లో పడ్తే చూపు పోతుంది). పాడుపడిన ఓ నూతిలో ఉన్న శిష్యుణ్ణి వెతికిన గురువు ఆజ్ఞతో అశ్వినీదేవతల్ని ప్రార్థించి చూపు పొందాడు.

"నీ నోటి దంతాలు స్వర్ణమయం. వేదాలు, ధర్మశాస్త్రాలు నీకు కరతలామలకం అవుతాయి" అని ధౌమ్యుడు అనుగ్రహించాడు.

మూడో శిష్యుడు వేదుడు. అతని చేత బండచాకిరీ చేయించేవాడు ధౌమ్యుడు. తిండితిప్పలు లేకుండా, అన్ని కాలాల్లో గురువాజ్ఞను పాటించి సర్వజ్ఞత్వంని పొందాడు వేదుడు. ఎంత మంచివాడంటే తన శిష్యులకి ఎలాంటి పని అప్పజెప్పేవాడు కాదు వేదుడు. తను పడ్డ కష్టాలు తన శిష్యులు పడకూడదని ఆయన భావన. ఒకసారి జనమేజయుడు, పౌష్యుడు ఈ వేదుని తమ పురోహితునిగా ఎన్నుకున్నారు. ఆయన బైటకెళ్తే ఇంటిపనులు చూడటం కోసం వేదుడు తన శిష్యుడైన ఉత్తంకుని (ఉదంకుని)కి బాధ్యతలు అప్పజెప్పేవాడు. అందుకే వేదుడు "నాయనా! నీ సేవలు చాలు, నీవిక స్వతంత్రంగా బతుకు" అని అనుజ్ఞ ఇస్తే "గురుదక్షిణ అడగండి" అని మొండికేశాడు.

అప్పుడు గరుపత్ని "నాయనా, పౌష్యమహారాజు భార్య ధరించే చెవికుండలాలు తీసుకునిరా" అని చెప్పింది. ఉత్తంకుడు రాణిని కలిసాడు. ఆమె సంతోషంగా తన చెవికుండలాల్ని అతనికిచ్చి "నాయనా! తక్షకుడు వీటిని కాజేయాలని ప్రయత్నిస్తున్నాడు, జాగ్రత్త" అని హెచ్చరించింది. ఎలాగైతేనేం.. ఉత్తంకుడు అన్ని ఆటంకాలు ఎదుర్కొని గురుపత్నికి రాణి చెవికుండలాలు ఇచ్చి ఆశీస్సులు పొందాడు.

ఒకప్పుడు శిష్యులకి గురువులపై అత్యంత భక్తిశ్రద్ధలతో విద్యను సంపూర్ణంగా నేర్చుకోవాలనే తపన ఉండేది. పన్నెత్తి పలకకుండా తు.చ. తప్పకుండా వారి ఆజ్ఞల్ని శిరసావహించేవారు. చదువు పూర్తి కాగానే గురువు అనుజ్ఞతో అక్కడ్నించి వెళ్లిపోయి ఉత్తమ జీవితాన్ని సంతృప్తిగా గడిపి ధన్యులైనారు.

**- అచ్యుతుని రాజశ్రీ**

సింగిల్ పేజీ కథ

# తండ్రిప్రేమ

"స్రవంతీ! వంట అయిందా? నేను వెంటనే వెళ్లాలి" అంటూ భాస్కరయ్య పిలిచిన పిలుపుకి వంటింట్లో ఉన్న స్రవంతి "ఆ.. వచ్చి కూర్చోండి, వడ్డిస్తా" అంటూ నుదుటికి పట్టిన చెమటను చీరెకొంగుతో తుడుచుకుంటూ వేడి వేడిగా పొగలు కక్కుతున్న గిన్నెను కిందకు దించిపెట్టింది.

గబగబా వచ్చిన భాస్కరయ్యకు భోజనం వడ్డిస్తూ "ఏమండీ! మన భారతి మీతో ఏదో మాట్లాడాలనుకుంటోంది" అంటూ గదిలో నుంచి రమ్మన్న పిలుపు కోసం ఎదురు చూస్తున్న భారతి వైపు చూసింది.

"సాయంత్రం వచ్చాక మాట్లాడదాం.." అంటూ మజ్జగలోకి వెళ్లకుండానే భోజనాన్ని ముగించేసాడు. భాస్కరయ్యకు ఇద్దరు ఆడపిల్లలు. మధ్య తరగతి కుటుంబం. తన తండ్రి తనకిచ్చిన ఇల్లు తప్ప అతనివద్ద ఇంకేమీ లేదు. పెళ్లికి ముందు బాగా అల్లరి చిల్లరగా తిరిగేవాడు. స్రవంతిని పెళ్లి చేసుకున్నాక చాలా మారిపోయాడు. వచ్చిన ఆదాయంలోనే పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు అని వేరు చేసుకొని కూడబెడుతున్నాడు.

ఉన్నదాంట్లోనే పండగ చేసే మనసున్న మనిషి స్రవంతి. బయట ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే ఆడపిల్లలను చదివించడానికే జంకాడు. భార్య ధైర్యం చెప్పిందని ఓ వైపు అరచేతిలో గుండెలు పట్టుకుని ఇద్దరినీ చదివిస్తున్నాడు. పెద్ద కూతురు భారతి తండ్రికి ఏనాడూ ఎదురు చెప్పలేదు. ఆయన చెప్పిన విధంగానే నడుచుకుంటూ చదువును ముందుకు సాగించింది. భాస్కరయ్య చెప్పే ప్రతి మాటలో వాళ్లకు తన బిడ్డలపై ఒక తండ్రి పడే ఆవేదన కనపడేది. భాస్కరయ్య మనసులో తన పిల్లల ఎదుగుదలను, స్వేచ్ఛను హరిస్తున్నానేమో అన్న భావన బలంగా మెదులుతూనే ఉంది. రాత్రి భోజనం ముగించుకొని నేలపై పరిచిన బొంతలపైకి చేరాడు మెల్లగా. ఆయన పాదాల దగ్గర వచ్చి కూర్చుంది భారతి.

"ఏదో చెప్పాలన్నావు" అన్న ఆయన మాట కోసం ఎదురు చూసిన భారతి ఆలస్యం చేయకుండా "నాన్నా, నేను ఉద్యోగం చేయాలనుకుంటున్నాను" అంది.

చెవిన పడ్డ మాట నిజమా? కాదా? అన్న సందేహం వచ్చి మళ్లీ చెబుతుందేమో అన్న విధంగా ఆమె వైపు చూసాడు. "నాన్నా, నేను.." అనగానే కాసేపు ఆగు అన్నట్టు సైగ చేసాడు.

కాసేపటికి "మీరు ఉద్యోగం చేయడం ఇష్టంలేదు. నీ చదువు అయిపోయింది కాబట్టి మనకు తెలిసినవాళ్లకు సంబంధాలు కూడా చూడమని చెప్పాను. దేవుని దయవల్ల నిన్నొక అయ్య చేతిలో పెడితే నా బాధ్యత తీరిపోతుంది" అన్నాడు.

తండ్రి మనసును అర్థం చేసుకున్న భారతి మాట్లాడకుండా తన గదిలోకి వెళ్లిపోయింది.

"అక్కా! నాన్న ఎప్పుడూ మనల్ని భయపెడుతూ తాను భయపడుతుంటారు? మన ఇంట్లో ఇలా జరుగుతోందంటే నాకు ఏదోలా ఉంది" అంది రమ్య.

చెల్లెలు మాటలకు ఒక చిన్న నవ్వును నవ్వి మెల్లగా నిద్రలోకి జారుకుంది భారతి.

..................

రోజులా కాకుండా ఆఫీసు అంతా చాలా కోలాహలంగా ఉంది. ఉద్యోగులందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇంతలో మైకులో ఒక ప్రకటన వినిపించింది. "అందరూ త్వరగా వచ్చి మీ.. మీ స్థానాలలో కూర్చోండి. మరికొద్దిసేపట్లో మన డైరెక్టర్‌గారు వచ్చి సభ ప్రారంభిస్తారు" అన్నారు ఒక ఉద్యోగి.

> "అందరూ త్వరగా వచ్చి మీ స్థానాలలో కూర్చోండి. మరికొద్దిసేపట్లో మన డైరెక్టర్‌గారు వచ్చి సభ ప్రారంభిస్తారు" అన్నారు ఒక ఉద్యోగి.

ఆ సంస్థ డైరెక్టర్ రమేష్ అక్కడికి చేరుకున్నారు. "అందరికీ నమస్కారం, ఈరోజు మనం ఇక్కడ సమావేశమవడానికి ప్రధాన కారణం మీ అందరికీ తెలుసు. మీలో ఒకరిగా విధులు నిర్వహిస్తున్న నా జీవిత భాగస్వామి భారతి ప్రభుత్వం నుంచి మన సంస్థకు అతిపెద్ద కాంట్రాక్టును తెచ్చి మీకు, నాకు గుర్తింపును తెచ్చింది. ఇకపై ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతిఒక్కరు మన సంస్థను నిరంతరం తలచుకుంటారు" అనగానే సభ చప్పట్లతో మారు మోగింది. కింది వరుసలో కూర్చున్న భారతి సభపైకి చేరింది. ఎదురుగా స్నేహితులు, సహోద్యోగులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. కానీ ఆమె కళ్లు మాత్రం ఎవరినో వెతుకుతున్నాయి. ఇంతలో కనబడ్డారు అమ్మ, చెల్లెలు రమ్య.

"సభకు నమస్కారం, నా పేరు భారతి. రమేష్‌గారి భార్యను. ఈ కంపెనీ మీ వారిది, చాలా మంది నువ్వెందుకు కింది స్థాయిలో పని చేయడం?" అన్నారు.

వీటన్నిటికీ ఒకటే సమాధానం. నేను మొదటగా మా నాన్న కూతుర్ని 'డాటరాఫ్ భాస్కరయ్య'. మా నాన్న మమ్మల్ని ఎప్పుడూ చులకనగా చూడలేదు. చాలా మందికి తెలుసు. మా నాన్న గడప దాటనిచ్చేవాడు కాదు. అది చూసిన అందరూ ఈయన చాదస్తం మనిషి, ఇలాగైతే వాళ్లు బతికేదెలా?" అని జాలిపడ్డారు. మా చెల్లెలు కూడా ఎన్నోసార్లు ఇంకా ఎందుకిలా? అన్నది.

కానీ అప్పుడు మా నాన్న మాపై పెట్టింది ఆంక్షలు కాదు, అక్షింతలు. ఆయన పెంపకం వల్లనే నేను ఈరోజు ఇంత పెద్ద కుటుంబానికి కోడల్ని అయ్యాను. ఆడపిల్లలంతా తాము ఉద్యోగం చేసి సంపాదిస్తేనే చదువుకు సార్థకత అనుకుంటారు. కానీ మనం ఎందుకు గృహిణిగా మంచి బాధ్యత తీసుకోకూడదు. ఇంటిని చూసి ఇల్లాలిని చూడమన్నారు కదా అలాంటిది కేవలం బయట మనం చేసే ఉద్యోగమేనా సంపాదన అంటే! మన బాగు కోరే వ్యక్తులు, తల్లిదండ్రులు వారు చెప్పే మాటలు మనల్ని మోసం చేయడానికి కాదు, మన కీర్తిని మోసుకెళ్లడానికి అని నమ్మాలి" అంటూ చిన్నపాటి కంటిచెమ్మ తుడుచుకుంది.


అక్కడ చప్పట్ల శబ్దం మారుమోగలేదు, నిశ్శబ్ద యుద్ధం జరిగింది. హృదయాలన్నీ బరువెక్కి లోలోపల తమ తమ తల్లిదండ్రులకు కన్నీళ్ల అభిషేకం చేస్తున్నాయి. ఇప్పుడు ఇదంతా చూడటానికి భాస్కరయ్య లేడు. ఆయన భార్య మాత్రం ఆయన్ను అనుసరించిన దానికి జీవితం సార్థకం చేసుకుంది.


అప్పటివరకు తల్లిమాట అంటే కాస్త చిరాకుపడే చిత్ర అమ్మకు వేదిక పైనే పాదాభివందనం చేసింది. కంపెనీ తన పనిలో తాను మునిగిపోయింది.


భారతి బాధ్యతగల కుమార్తెను తయారు చేసింది.

**- సింగంపల్లి శేషసాయి కుమార్**

ఈ వారం కా'ర్ట్యూన్స్'


ఆపరేషన్ కోసం మనిషిని కోసేప్పుడు.. ఫీజులు గుంజేప్పుడు
డాక్టర్ అనే వాడు గుండెను బండ చేసుకోవాలి..!!


ఏమండీ.. స్నానానికెళ్తున్నారా..? ఈరోజు ఒక పక్క చేసి రండి..!
వెళ్లండి నీళ్లొచ్చాక ఇంకో పక్క చేద్దురు గానీ...!!
Zakir...


శల్య రాజుకు బొత్తిగా 'యుద్ధం రూల్స్' తెలిసినట్లు లేదు...
మహారాజు గారు పద్యం చదివేలోగానే వాడొచ్చి చావబాది వెళ్లాడు..!
Zakir...



ఉత్తర స్వీడన్‌లోని జుక్కాస్‌జార్వి అనే గ్రామంలో ఉన్న ఐస్ హోటల్‌కి సంబంధించిన చిత్రాలివి. ఈ హోటల్‌లోని గోడలు, ఫర్నిచర్‌తో సహా అన్ని మంచుతో తయారైనవే. ప్రతి సంవత్సరం డిసెంబరు నుండి ఏప్రిల్ వరకు పర్యాటకుల కోసం తెరిచి ఉంటుందీ హోటల్.







